


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 21.08.2025 | సంపుటి : 2 | సంచిక :199 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Thursday | 21.08.2025 | volume : 2 | Issue : 199 | Pages : 8 | Cost : 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు
# లోక్‌సభ ఆమోదం

డబ్బులతో ముడిపడిన ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహణను నిషేధించే కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 'ది ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025' పేరిట తీసుకొచ్చిన ఈ బిల్లును కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం లోక్‌సభలో ప్రవేశపె ట్టారు. మూజువాణి ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందింది.



06

## ఢిల్లీ సీఎం
# రేఖా గుప్తాపై దాడి

- సీఎంకు వినతిపత్రం ఇచ్చినట్లే ఇచ్చి దాడి
- చెంపపై కొట్టిన యువకుడు
- దాడిని తీవ్రంగా ఖండించిన మాజీ సీఎం అతిషి

03

ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి జరిగింది. సివిల్ లైన్స్‌లోని అధికారిక నివాసంలో 'జన్ సున్‌వా య్' నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు భాజపా వర్గాలు వెల్లడించాయి. 35 ఏళ్ల వయ-సున్న ఓ వ్యక్తి ఈ దాడికి పాల్పడినట్లు తెలిపాయి. తొలుత అతడు కొన్ని పేపర్ల ను సీఎంకు అందించిన తర్వాత ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది.



## ఫలించిన తెలంగాణ
# ఎంపీల పోరాటం

- 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా
- ఎంపీలను అభినందించిన మంత్రి తుమ్మల



రాష్ట్రంలో రైతులకు తగినంత యూరియా సరఫరా చేయాలంటూ కేంద్రంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు చేసిన పోరాటం ఎట్టకేలకు ఫలించింది. తెలంగాణ రాష్ట్రానికి 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసేందుకు కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మొత్తం ఈ వారంలో తెలంగాణకు సరఫరా చేస్తామని సదరు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దీంతో కర్ణాటక నుంచి 10,800 మెట్రిక్ టన్నుల యూరియా షిప్ మెంట్ ప్రారంభం కానుంది.

## కాంగ్రెస్ పాలనలో రైతులు రోడ్డెక్కారు

- ఎరువుల కోసం మళ్లీ క్యూ కట్టారు
- కేసీఆర్ పాలనలో ఇంతటి దైన్యం ఎప్పుడూ రాలేదు.
- మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



03



## హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకునేవారంతా
# శత్రువులే

### హైదరాబాద్ అభివృద్ధికి ఎందరో కృషి

- హైటెక్ సిటీ కడతామన్నా వ్యతిరేకించారు
- అభివృద్ధిని కొనసాగించాలన్నదే మా పట్టుదల
- మూసీ ప్రక్షాళనతో ముందుకు సాగుతాం
- మరింత సుందర నగరంగా తీర్చిదిద్దుతాం
- ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రార్ కార్యాలయ శంకుస్థాపనలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్ట్ 20 :
ఐటీ రంగంలో చాలా మంది రాణించడానికి రాజీవ్ గాంధీ కారణమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆనాడు రాజీవ్ గాంధీ కంప్యూటర్‌ను దేశానికి పరిచయం చేశారని, పీవీ నర్సింహారావు స్పెషల్ ఎకనామిక్ జోన్‌ను మంజూరు చేశారని, నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హైటెక్ సిటీకి శంకుస్థాపన చేశారని సీఎం రేవంత్ తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఉమ్మడి రాష్ట్రంలో సీఎంలుగా పనిచేసిన చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాత్ర ఉందని వెల్లడించారు. 1994 నుంచి 2014 వరకు అప్పటి సీఎంలు హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. గూగుల్ లాంటి ప్రముఖ సంస్థల్లో తెలుగువారు ఉన్నత పదవుల్లో ఉన్నారని తెలిపారు. మన ప్రాంత విద్యార్థులు ఇక్కడే చదువుకోవాలని పలు సంస్థలు నిర్మించారని గుర్తు చేశారు. గచ్చిబౌలిలో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలకు సీఎం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు.

మిగతా 2 లో



03

## ఏఐ ద్వారా 2 గంటల్లోనే దర్శనం

- శ్రీవాణి దర్శన వేళలు మారుస్తున్నాం
- వీఐపీ దర్శనాలు ఉదయం 8 నుంచి 8:30 మధ్య ముగిస్తాం
- అన్యమతస్థులు ఉంటే వీఆర్ఎస్ ద్వారా పంపిస్తాం
- టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు



02

## తెలంగాణలో మద్యం దుకాణాలకు టెండర్లు

దరఖాస్తు రుసుం రూ.3 లక్షలు



## సాదాబైనామాలపై స్టే ఎత్తివేత

- త్వరలోనే 4లక్షల సాదాబైనామాలపై నిర్ణయం
- మంత్రి పొంగులేటి వెల్లడి

02



03

## మేడారం జాతరకు 150 కోట్లు మంజూరు

## కృష్ణ, గోదావరి
# ప్రాజెక్టులకు జలకళ

- సాగర్ వద్ద 26 గేట్ల ఎత్తివేత
- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

భారీ వర్షాల నేపథ్యంలో జలాశయాలకు జలకళ వచ్చింది. దాదాపు అన్ని జలాశయాలు నిండుకుండలా మారాయి. కృష్ణా, గోదావరి నదులకు వరద పోటెత్తుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు భారీగా నీరు చేరుతోంది. ఈ సీజన్‌లో సాగర్‌కు 4.10 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడం ఇదే తొలిసారి. దీంతో అధికారులు 26 గేట్లను 10 అడుగుల మేర పైకి ఎత్తి, దిగువకు నీటిని విడుదల చేశారు. ఇది కూడా ఇదే మొదటిసారి.

03





## ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రాధాకృష్ణన్ నామినేషన్

### ప్రధాని మోడీ, అమిత్ షా, రాజ్‌నాథ్ తదితరుల హాజరు

02

ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ బుధవారంనాడు తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా పలువురు మంత్రుల సమక్షంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను రాధాకృష్ణన్ సమర్పించారు. నామినేషన్ ప్రక్రియలో భాగంగా నాలుగు సెట్ల పేపర్లు దాఖలు చేశారు. తొలి సెట్‌కు చీఫ్ ప్రపోజర్‌గా ప్రధాని ఉన్నారు.

## త్వరలో మరిన్ని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ

- నకిలీ మందుల అమ్మకాలపై కఠిన చర్యలు
- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా



03

## ₹ కూకట్‌పల్లిలో ఎకరం
# 70 కోట్లు

- 7.8 ఎకరాల భూమిని దక్కించుకున్న గోద్రెజ్
- హౌసింగ్ బోర్డుకు రూ 547 కోట్ల మేర ఆదాయం





## ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రాధాకృష్ణన్ నామినేషన్

### ప్రధాని మోడీ, అమిత్ షా, రాజ్‌నాథ్ తదితరుల హాజరు

**న్యూఢిల్లీ, ఆగష్టు 20 :** ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ బుధవారంనాడు తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా పలువురు మంత్రుల సమక్షంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను రాధాకృష్ణన్ సమర్పించారు. నామినేషన్ ప్రక్రియలో భాగంగా నాలుగు సెట్ల పేపర్లు దాఖలు చేశారు. తొలి సెట్‌కు చీఫ్ ప్రపోజర్‌గా ప్రధాని ఉన్నారు. నామినేషన్ పత్రాల దాఖలుకు ముందు సీపీ రాధాకృష్ణన్ ప్రేరణా స్థల్ వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. నామినేషన్ పత్రాల దాఖలు అనంతరం సీపీ రాధాకృష్ణన్ విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేసారు. నామినేషన్ పత్రాల దాఖలుకు మంత్రులు, ఎన్డీయే నేతలతో కలిసి వెళ్లామని, ఉపరాష్ట్రపతి పదవికి రాధాకృష్ణన్ వన్నెతెస్తారని, దేశం మరింత ప్రగతి పథంలోకి వెళ్తుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నికల జరగనుండగా, విపక్ష అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని నిలిపారు. ఉపరాష్ట్రపతి పదవికి ఎన్డీఏ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీపీ రాధాకృష్ణన్‌ను టీడీపీ ఎంపీలు అభినందించారు. ఆయన నామినేషన్ పత్రాలపై కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు, తెన్నేటి కృష్ణప్రసాద్ సంతకాలు చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి రాధాకృష్ణన్‌కే తాము మద్దతిస్తామని వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మూడ్రోజుల క్రితమే తమ పార్టీ అధినేత జగన్‌కు ఫోన్ చేసి మద్దతు కోరారని.. జగన్ ఆ మేరకు హామీ ఇచ్చారని తెలిపారు. ఒకసారి హామీ ఇచ్చిన తర్వాత తమ వైఖరి మార్చుకోబోమని స్పష్టంచేశారు.

# హైదరాబాద్ అభివృద్ధికి ఎందరో కృషి

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైటెక్ సిటీ నిర్మాణానికి అప్పుడు అవహేళన ఎదురైందన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరం సింగపూర్, టోక్యోతో పోటీ పడుతోందని, మన వద్ద అన్ని వనరులు ఉన్నప్పుడు చిత్తశుద్ధితో పనిచేయాలని చెప్పారు. అమెరికాలో మన ఐటీ నిపుణులు పనిచేయడం ఆపేస్తే అక్కడ సాంకేతిక రంగం స్థంభించి పోతుందని తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలతో కూడిన ఉద్యోగ భద్రత కల్పించామని చెప్పారు. రాబోయే పదేళ్లలో వన్ బిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు. "ఇప్పుడు మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారు? మూసీ మురికిలో పేదలు ఎందుకు బతకాలని అనుకుంటారు?" అని ప్రశ్నించారు.

### మూసీ ప్రక్షాళన చేస్తామంటే ఎందుకు నిరాకరిస్తున్నారు?

అలాగే, చిన్న వర్షాలకు కూడా నగరం మునిగిపోతున్నందుకు ఆవేదన



వ్యక్తం చేశారు. "మూసీ ప్రక్షాళన చేస్తామంటే కొందరు ఎందుకు నిరాకరిస్తున్నారు? ఈ నగరాన్ని ఇలాగే వదిలేస్తామా? లేదా ప్రపంచానికి ఆదర్శంగా నిలబడేలా చేస్తామా?" అని ప్రశ్నించారు. ప్రపంచం ఆశిస్తున్న స్థాయిలో హైదరాబాద్ అభివృద్ధి చెందాల్సి ఉందని, మనం న్యూయార్క్, టోక్యో లాంటి నగరాలతో పోటీ పడాలని, చిత్తశుద్ధితో పని చేస్తే ఏదైనా సాధ్యమవుతుందని అన్నారు. "వరిజిబుల్ సిటీని గోల్డెన్ సిటీలోకి మార్చాలంటే మూసీ ప్రక్షాళన తప్పనిసరి. మన నదులను శుభ్రం చేయాల్సిన అవసరం ఉంది. గంగా, యమునా, సబర్మతీ నదులను ఆయా రాష్ట్రాలు శుభ్రం చేశాయి. మనం కూడా మూసీని శుభ్రం చేసుకోవాలి" అని చెప్పారు. పేదల కోసం స్థలాలు వెతకమని మంత్రులకు చెబుతున్నానని, వారికి సొంత ఇల్లు కట్టిపెట్టాలని, నగర విస్తరణ ద్వారా ఆ కల నెరవేరుతుందని తెలిపారు. మూసీ పరిసరాల్లో నైట్ ఎకానమీ అభివృద్ధి చేయాలని సూచించారు. గత ముఖ్యమంత్రుల దూరదృష్టి వల్లే అనేక అంతర్జాతీయ కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చాయని గుర్తు చేశారు. ప్రస్తుతం మన ఐటీ నిపుణులు అమెరికాలోని సిలికాన్ వ్యాలీని శాసిస్తున్నారని, వారు ఒక్క రోజు పని చేయకపోతే అమెరికా స్థిరంగా నిలవదని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంగా, 2047 నాటికి రాష్ట్రాన్ని త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దాలని అన్నారు.

### ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అన్ని వసతులు

ప్రతి సంవత్సరం 15 వేల కోట్ల ఆదాయం తెచ్చే రిజిస్ట్రేషన్ శాఖను "బంగారు గుడ్డు పెట్టే బాతు"గా వర్ణిస్తూ, లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టి ఆదాయం తీసుకొస్తున్న వారిని దొంగలుగా చూడకూడదని, నేరస్తులలా వారిని చూడడం తప్పని అన్నారు. ఈ ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అన్ని వసతులు ఉంటాయని తెలిపారు. ఈ ప్రభుత్వం వీధికి వీధికి వసతులు కల్పించాలనే ధ్యేయంతో పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 144 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రతి సంవత్సరం 19 లక్షల డాక్యుమెంట్లు నమోదవుతున్నాయని చెప్పారు. విదేశాల్లో కూడా మన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు మంచి పేరు ఉందని, అన్ని ప్రభుత్వ శాఖలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2034లో ప్రపంచం హైదరాబాద్‌ను ఫ్యూచర్ సిటీగా చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. జూన్ 2వ తేదీ లోపు 11 ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలను పూర్తిచేయాలని అన్నారు. కేవలం 8 నెలల్లో అపర్ణ కన్స్ట్రక్షన్ వారు ఈ ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తారని సీఎం రేవంత్ తెలిపారు.

### తెలంగాణ రైజింగ్ 2047 ద్వారా అభివృద్ధి

తెలంగాణ రైజింగ్ 2047 ద్వారా అభివృద్ధి సాధిద్దామని అన్నారు. మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సరైన సౌకర్యాలు లేవని, అన్ని వసతులతో కూడిన కార్యాలయాలు నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించిందని వెల్లడించారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా పరిపాలన కు ఇబ్బంది లేకుండా నిర్మాణాలు చేపడతామని చెప్పారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా 30 కోట్ల రూపాయలతో ఈ భవన నిర్మాణానికి అపర్ణ కన్స్ట్రక్షన్ కేటాయించిందని వివరించారు. నిజాం నవాబుల 400 ఏళ్ల చరిత్ర ఉన్న నగరంలో మాదాపూర్, కొండాపూర్, వట్టినాగులపల్లి వరకు అభివృద్ధి చేసేందుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి స హా పలువురు ముఖ్యమంత్రులు కృషి చేశారని గుర్తు చేశారు. ప్రపంచంలోని 500కు పైగా కంపెనీలు హైదరాబాద్‌లో ఉన్నాయని తెలిపారు.

# ₹ కూకట్‌పల్లిలో ఎకరం 70 కోట్లు

- 7.8 ఎకరాల భూమిని దక్కించుకున్న గోద్రేజ్
- హౌసింగ్ బోర్డుకు రూ 547 కోట్ల మేర ఆదాయం

**హైదరాబాద్, ఆగష్టు 20 :** హైదరాబాద్ పరిసరాల్లో రియల్ ఎస్టేట్ రంగానికి మరింత ఉత్తేజం కల్గించేలా, ఈరంగంలో పెట్టుబడులు పెట్టడానికి అనేక సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ప్రతిష్టాత్మకమైన గోద్రేజ్ ప్రాపర్టీస్, అరబిందో రియాల్టీ, ప్రెస్టీజ్ ఎస్టేట్స్ , అశోక బిల్డర్ సంస్థలు కూకట్ పల్లి హౌజింగ్ బోర్డు కాలనీ లో 7.8 ఎకరాల విస్తీర్ణంలోని భూమిని కొనుగోలు చేయడానికి పోటీ పడ్డాయి. హౌజింగ్ బోర్డు బుధవారం నాడు పారదర్శకంగా ఈ - వేలం ద్వారా ఈ భూములను విక్రయించింది. ఈ భూమిని ఎకరం రూ.70 కోట్ల ధరతో ఈ భూములను గోద్రేజ్ సంస్థ ముందుకు కొనుగోలు చేసింది. గోద్రేజ్ సంస్థ ప్రవేశం ద్వారా హైదరాబాద్ పరిసరాల్లో రియల్టీ రంగం మంచి జోరందుకుని, పురోభివృద్ధి సాధించేందుకు దోహదపడుతుందని అంటున్నారు. హై-టె-క్ సిటికి సమీపంలో ఉన్న ఈ ప్రాంతంలో ఇప్పటికే అనేక సంస్థలకు చెందిన బహుళ అంతస్థుల భవనాలు ఉండగా, తాజాగా గోద్రేజ్ ఆధ్వర్యంలో మరో ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు రానున్నది. కూకట్ పల్లిలోని 7.80 ఎకరాల భూములను ఈ-వేలం ద్వారా విక్రయించడానికి హౌసింగ్ బోర్డు గత నెలలో నోటిఫికేషన్ ఇచ్చింది. బుధవారం నాడు ఆన్ లైన్ పారదర్శకంగా నిర్వహించిన వేలం పాటలో దేశ వ్యాప్తంగా పేరుగాంచిన గోద్రేజ్ ప్రాపర్టీస్, అరబిందో, ప్రెస్టీజ్ అశోకా బిల్డర్స్ సంస్థలు పాల్గొన్నాయని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ శ్రీ వి.పి. గౌతం తెలిపారు. సుమారు మూడున్నర గంటల పాటు- నిర్వహించిన ఈ వేలం పాటలో ఎకరాకు రూ .40 కోట్లు- కనీస ధరగా నిర్ణయించగా, బిడ్డర్లు 46 సార్లు ధరను పెంచుతూ వేలంలో పాల్గొన్నారు. ఈ వేలం పాటలో ఇందులో గోద్రేజ్ సంస్థ అత్యధికంగా ఎకరానికి 70 కోట్లు- చెల్లించడానికి ముందుకు వచ్చి భూములను దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ భూముల విక్రయం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ 547 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ఇలా భూముల విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రయోజనం కల్గించే గృహ నిర్మాణ పథకాలకు వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ కు చెందిన టౌన్ షిప్ లలో అసంపూర్తిగా ఉన్న బహుళ అంతస్థుల భవనాల (3 టవర్లు) విక్రయం ద్వారా ప్రభుత్వానికి 70.11 కోట్ల ఆదాయం వచ్చింది. నగర శివార్లలోని పోచారం టౌన్ షిప్ లో మొత్తం 194 ఫ్లాట్లు- ఉన్న రెండు టవర్లను (112 ఫ్లాట్లు-, 72 ఫ్లాట్లు-), గాజుల రామారం లోని 112 ఫ్లాట్ లు ఉన్న ఒక టవర్ ను బుధవారం నాడు లాటరీ ద్వారా కేటాయించారు. పోచారంలోని నిర్మాణాలకు చదరపు అడుగుకు రూ 1650/ధరను, గాజులరామారంలోని వాటికి రూ 1995ను నిర్ణయించారు. ఇందులో భాగంగా పోచారంలో 72 ఫ్లాట్లతో అసంపూర్తిగా ఉన్న టవర్ ను ఎన్ టి పిసి ఎంఎ÷-లాయిస్ అసోసియేషన్ కు రూ.13.78 కోట్లకు, 122 ఫ్లాట్లు- ఉన్న మరో టవర్ ను గాయత్రీ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ ట్రస్టు వారికి రూ30 కోట్ల మొత్తానికి లాటరీ ద్వారా కేటాయించారు. అలాగే గాజులరామారం లోని 112 ఫ్లాట్లతో అసంపూర్తిగా ఉన్న టవర్ ను ఎఫ్ సి ఐ ఎంప్లాయిస్ అసోసియేషన్ వారికి రూ. 26.33 కోట్ల మొత్తానికి కేటాయించారు.

# త్వరలో మరిన్ని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ

- నకిలీ మందుల అమ్మకాలపై కఠిన చర్యలు
- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**హైదరాబాద్, ఆగష్టు 20 :** త్వరలో మరిన్ని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను మంజూరు చేసి, రిక్రూట్ చేస్తామని తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు. ఈ పోస్టుల భర్తీతో తద్వారా డ్రగ్ కంట్రోల్ అథారిటీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. డ్రగ్ కంట్రోల్ అథారిటీ- అధికారులతో ఇవా(బుధవారం) రాష్ట్ర సచివాలయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024 - 2025లో డీసీఏ వర్క్ ప్రోగ్రెస్‌ను మంత్రికి డీసీఏ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం వివరించారు. 2024లో 25,939 తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన 4142 సంస్థలపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. 2025లో జనవరి నుంచి జూలై నెల వరకు 16,481 తనిఖీలు చేశామని, నిబంధనలు ఉల్లంఘించిన 2827 సంస్థలపై చర్యలు తీసుకున్నామని వివరించారు. 2024 జనవరి నుంచి 2025 జులై వరకు 7200 మందుల శాంపిల్స్‌ను పరిక్షించగా, అందులో 186 నాసిరకం (కుష ÷ూషశశస షశషా) మెడిసిన్లుగా తేలాయని, సంబంధిత సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకున్నామని తెలిపారు. సుమారు 700 కేసులు బుక్ చేశామని, ప్రతి కేసులోనూ దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. జనాలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తూ, మెడిసిన్ అమ్మకాలు జరుపుతున్న కంపెనీలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని హుకుం జారీ చేశారు. స్పూరియస్, నాట్ స్టాండర్డ్ డ్రగ్స్ తయారు చేస్తున్న ఫార్మా కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు, అమ్మకదారులపై కఠినంగా వ్యవహరించాలని నిర్ధేశిరచారు. మెడిసిన్ అనేది ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశమని, ఈ విషయంలో ఎలాంటి ఉపేక్ష పనికిరాదని హెచ్చరించారు. పదే పదే నిబంధనలు ఉల్లఘింస్తున్న సంస్థలను చట్టప్రకారం పర్మినెంట్‌గా మూసివేయాలని ఆదేశించారు. నకిలీ, నిషేధిత మందుల తయారీ, అమ్మకం దారులపై అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ దిశానిర్ధేశర చేశారు. మెడిసిన్‌ను ఆహార పదార్థాలుగా చూపిస్తూ, వాటి తయారీ, అమ్మకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని నిర్ధేశిరచారు. యాంటిబయాటిక్ రెసిస్టెన్స్ అనేది పెద్ద ముప్పుగా పరిణమిస్తోందని, నిబంధనలు ఉల్లంఘించి యాంటిబయాటిక్స్ అమ్మకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు ప్రేరేపిత మెడిసిన్ అమ్మకాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డీసీఏ డీజీని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. డ్రగ్ -టె-స్టింగ్ ల్యాబ్ అప్‌గ్రేడేషన్ పనుల్లో వేగం పెంచాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన మందులు, క్వాలిటీ- ఫుడ్ అందించే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు.

## జస్టిస్ ఘోష్ కమిషన్‌పై హైకోర్టు విచారణ

### నేడు విచారణ చేపట్టనున్న ఉన్నత న్యాయస్థానం

**హైదరాబాద్, ఆగష్టు 20 :** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై కెసిఆర్ పిటిషన్‌ను హైకోర్టు విచారణక స్వీకరించింది. కమిషన్ నివేదికను రద్దు చేయాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరగనుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలపై న్యాయ విచారణకు జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ 2024 మార్చి 14న ప్రభుత్వం జారీ చేసిన జీవో 6ను కూడా అందులో సవాలు చేశారు. ప్రతివాదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి, జస్టిస్ ఘోష్ కమిషన్‌ను పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నాటి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాల్జేసే రాజకీయ వ్యూహంలో భాగంగా కమిషన్ నియామకం జరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా కమిషన్ నివేదిక రూపొందించిందని పిటిషన్లలో పేర్కొన్నారు.



## సాదాబైనామాలపై స్టే ఎత్తివేత

- త్వరలోనే 4లక్షల సాదాబైనామాలపై నిర్ణయం
- మంత్రి పొంగులేటి వెల్లడి

**హైదరాబాద్, ఆగష్టు 20 :** సాదా బైనామాలపై తెలంగాణ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది.. సాదా బైనామాలపై గతంలో విధించిన స్టే ఎత్తేస్తూ నిర్ణయం తీసుకుంది కోర్టు. హైకోర్టు తాజా నిర్ణయంతో ఇప్పటికే పెండింగ్ లో ఉన్న తొమ్మిదిన్నర లక్షల దరఖాస్తులకు ఊరట లభించనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 నవంబర్ 10 వరకు ఆన్ లైన్ లో దరఖాస్తులు స్వీకరించింది. ఆ తర్వాత సాదా బైనామాలపై స్టే విధించింది హైకోర్టు. సాదా బైనామాల అంశంపై బుధవారం విచారణ జరిపిన హైకోర్టు స్టే ఎత్తేస్తూ తీర్పు వెల్లడించింది. ఆర్ ఓ ఆర్ చట్టంలో సాదా బైనామా అంశాన్ని పొందుపర్చకపోవడంతో.. సుమారు తొమ్మిదిన్నర లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగులో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పుడు సాదాబైనామాలపై ఉన్న స్టే ఎత్తేస్తూ హైకోర్టు నిర్ణయం తీసుకోవడంతో గత కొన్నేళ్లుగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులకు మోక్షం లభించనుంది. ఇదిలా ఉండగా.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సాదాబైనామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే 4 లక్షల సాదాబైనామాలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల సమయంలో సాదాబైనామాలు క్లియర్ చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే సాదాబైనామాలపై హైకోర్టు స్టే ఉండటంతో ఈ అంశం పరిష్కారానికి ప్రభుత్వానికి ఇబ్బంది ఉండేది. ఇప్పుడు కోర్టు తీర్పుతో సాదాబైనామాలను క్లియర్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ వచ్చిందని చెప్పాలి.

# పోలీసుల అదుపులో మావోయిస్ట్ నేతలు

### రాష్ట్ర కమిటీ సభ్యురాలు సునీత ఒకరు

**హైదరాబాద్, ఆగష్టు 20 :** తెలంగాణ రాష్ట్ర పోలీసులు మావోయిస్టులకు గట్టి షాక్ ఇచ్చారు. మావోయిస్టు ఉద్యమంలో కీలక స్థానంలో ఉన్న ఇద్దరు ముఖ్య వ్యక్తులు తాజాగా పోలీసుల వలలో చిక్కారు. అందులో రాష్ట్ర కమిటీ- సభ్యురాలు సునీత ఒకరు. ఆమె మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ భార్యగా గుర్తించారు. సుదీర్ఘకాలంగా అజ్ఞాతంలో ఉంటూ పార్టీ కార్యక్రమాలను నడిపిస్తున్న సునీత అరెస్టు మావోయిస్టు నేతృత్వానికి పెద్ద దెబ్బగా పోలీసులు అంచనా వేస్తున్నారు. అదేవిధంగా మరో మావోయిస్టు నాయకుడు చెన్నూరి హరీష్ కూడా స్వచ్ఛందంగా లొంగిపోయాడు. మావోయిస్టు కదలికలు ఎక్కువగా ఉన్న తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో ఈ పరిణామం పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. ఆయన లొంగిపోవడమే కాకుండా, ఇప్పటి వరకు మావోయిస్టుల కార్యకలాపాలపై తనకు తెలిసిన విషయాలను అధికారులకు వెల్లడిస్తున్నట్లు సమాచారం. ఇక ఈ తాజా పరిణామాలు మావోయిస్టుల భవిష్యత్ వ్యూహాలకు గట్టి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు బలగాలను సమీకరించే ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, అగ్రనేతల అరెస్టులు, లొంగిపోవడం వారిలో ఆందోళనను పెంచుతున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర పోలీసులు ఇప్పటికే మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లను మరింత వేగవంతం చేశారు. అడవీ ప్రాంతాల్లో కూంబింగ్ ఆపరేషన్లను కట్టు-దిట్టం చేస్తూ, భూగర్భంలో దాక్కున్న ఇతర నేతలపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో సునీత అరెస్టు, హరీష్ లొంగిపోవడం మావోయిస్టు కదలికలను బలహీనపరిచే అవకాశం ఉందని అధికారులు విశ్వసిస్తున్నారు.



## తెలంగాణలో మద్యం దుకాణాలకు టెండర్లు

**హైదరాబాద్, ఆగష్టు 20 :** తెలంగాణలో మద్యం దుకాణాల ఆశావాహులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాల టెండర్ల దరఖాస్తు కు ఆబ్కారీ శాఖ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. అలాగే, దరఖాస్తుల ఫీజు కూడా భారీగా పెంచేసింది. దరఖాస్తు పీజు రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పెంచినట్లు పేర్కొంది. వచ్చే రెండేండ్ల కాల పరిమితి 2025 డిసెంబర్ నుంచి 27 నవంబర్ వరకుకి కి సంబంధించి లాటరీ పద్ధతి ద్వారా మద్యం దుకాణాల లైసెన్సులను ఎంపిక చేయనుంది. మద్యం దుకాణాల కేటాయిం పులో గౌడ్‌లకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం కల్పిం చనుంది. మద్యం దుకాణాలకు 6 శ్లాబ్‌లలో లైసెన్స్‌లు జారీ చేయనుంది.

# యూరియా కొరత తీర్చండి

### లేకుంటే రైతులతో కలసి ఉద్యమిస్తాం
### బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు హెచ్చరిక



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు నానా అవస్థలు పడుతున్నారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. రైతులకు కంటి నిండా నిద్ర పట్టడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు అగ్ర తాంబూలం ఇస్తే రేవంత్ ప్రభుత్వం అద:పాతాళానికి తొక్కుతోందని మండిపడ్డారు. హరీష్ రావు మాట్లాడుతూ.. 'నాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో చెప్పులు లైన్‌లో పెట్టే పరిస్థితి ఉండింది. కేసీఆర్ ప్రభుత్వం చెప్పులకు చెక్ పెట్టి రైతుల చెంతకు యూరియా అందించింది. నేడు రైతులు యూరియా కోసం అష్టకష్టాలు పడుతుంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది. రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పెయిల్ అయింది. సగంమంది రైతులకు రుణమాఫీ కాలేదు. వడ్లు అమ్మి మూడు నెలలు అయినా రైతులకు 1300 కోట్ల రూపాయలు బోనస్ డబ్బులు ఇవ్వలేదు. రుణమాఫీ పేరిట ఎంతకాలం రైతుల ఉసురు పోసుకుంటావ్ రేవంత్ రెడ్డి?. అన్నీ ఎగ్గొట్టడం తప్ప.. రేవంత్ రెడ్డి ఇచ్చింది ఏమిటి?. కేసీఆర్ గోదావరి జలాలతో రైతుల పాదాలు కడిగారు. రేవంత్ రెడ్డి యూరియా కోసం రైతులతో పోలీసుల కాళ్లు మొక్కిస్తున్నారు. ఏ ఎన్నికలు పెట్టినా కాంగ్రెస్‌కు ఆ చేతులే గుణపాఠం చెబుతాయి. అందాల పోటీ-లకు మీటింగ్‌లు పెట్టావు కానీ రైతుల కోసం ఎందుకు మీటింగ్‌లు పెట్టడం లేదు. రేవంత్ రెడ్డి చేతగాని ముఖ్యమంత్రి. బడే భాయ్ చోట భాయ్ కలిసి రైతులకు ఏం న్యాయం చేశారు. రైతులకి యూరియా ఇవ్వని కాంగ్రెస్ నాయకులకు గ్రామాల్లో తిరిగే హక్కు లేదు. 51సార్లు డిల్లీ వెళ్లిన రేవంత్ రెడ్డికి రైతులకు యూరియా ఇచ్చే దమ్ములేదు, ముందుచూపు లేదు. రాష్టంలో రేవంత్ రెడ్డి ఎమర్జెన్సీ పాలన తెచ్చారు. యూరియా ఇవ్వని కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ అడ్డుకుంటాం. వెంటనే రైతులకు యూరియా అందించాలి. లేకుంటే యూరియా కోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం అని హెచ్చరించారు.

# కాంగ్రెస్ పాలనలో రైతులు రోడ్డెక్కారు

- ఎరువుల కోసం మళ్లీ క్యూ కట్టారు
- కాంగ్రెస్ చరిత్రలో రైతులను ఆదుకున్న దాఖలాలు లేవు
- ఈ దురవస్థలపై రైతన్నలు బాగా ఆలోచించాలి
- కేసీఆర్ పాలనలో ఇంతటి దైన్యం ఎప్పుడూ రాలేదు.
- మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, ఆగస్టు 20 :** పోలీసులను పెట్టి ఎరువులు పంచే దుస్థితి ఎన్నడూ లేదని, మరి ఈ పరిస్థితి రాష్ట్రంలో ఎందుకు వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో రాష్ట్ర రైతన్నలు ఆలోచించాలని కోరారు. హైదరాబాద్ నందినగర్‌లోని నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. గత రెండు నెలలుగా తెలంగాణలో ఊరు ఏదైనా, పల్లె ఏదైనా, తండోపతండాలుగా రైతులు, వారి కుటుంబ సభ్యులు అన్ని చోట్ల అవస్థలు పడుతున్న దయనీయ పరిస్థితిని దేశం, రాష్ట్రం మొత్తం చూస్తోంది. ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చిల్లర రాజకీయాలు చేయడం తెలుసు, బురదజల్లడం తెలుసు. కానీ, పనికివచ్చే ఒక్క పని చేతకాదు అనే విషయం స్పష్టంగా తేలిపోయింది.

### చాతకాని కాంగ్రెస్ పరిపాలన

చాతకాని కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన వల్ల రైతులు ఒక బస్తా ఎరువు దొరకక ఆగమాగమవుతున్న పరిస్థితి రాష్ట్రంలో కనిపిస్తోంది. చివరికి పంట అమ్ముకోవాలన్నా, పంట కొనాలన్నా ప్రభుత్వాన్ని ఆశ్రయించాల్సిన రైతులు అధికారుల కాళ్లపై పడే దుస్థితి ఏర్పడిందన్నారు. నేడు ఎరువుల బస్తాల కోసం కూడా రైతులు అధికారులను కాళ్లావేళ్ల పట్టుకుని బతిమిలాడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చరిత్ర ఎన్నడూ రైతుల విషయంలో సానుకూలంగా ఉండలేదని, రైతులకు మేలు చేసిన చరిత్ర కాదు అని అన్నారు. ఇవాళ మళ్లీ ఆ రోజులు వస్తాయని హోవ ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తన నిజ స్వరూపాన్ని బయటపెడుతోంది. అప్పట్లో అర్ధరాత్రి బైటకే పండుకునే దుస్థితి ఉండేదంటే, ఇప్పుడూ చివరి మహిళా రైతు ఎరువుల దుకాణం వద్ద పడుకునే దుస్థితి కనిపిస్తోంది. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ 'గొప్పతనం' వల్లే అంటూ విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వంలో ఆరు నెలల ముందే బఫర్ స్టాక్ తెప్పించి గోదాములు నింపడమైపోయేది. భారత్‌లో ఎక్కడ యూరియా లభించిందో అక్కడి నుంచి తెప్పించి రైతులకు ఇంటికే పంపే పరిస్థితి ఉండేది. మేము బాధ్యతలు చేపట్టినపుడు 4 లక్షల మెట్రిక్ టన్నుల గోదాముల సామర్థ్యం ఉండేది. సంవత్సరం, సంవత్సరన్నర లోపే దాన్ని 24 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని కెటిఆర్ గుర్తు చేశారు.

### దున్నపోతుపై వానపడ్డట్లుగా..

గోదాములు ఉన్నా, రైతు వేదికలు ఉన్నా, కష్టపడే రైతులు ఉన్నా, కేసీఆర్ కష్టపడి నిర్మించిన మిషన్ కాకతీయ చెరువులు, అద్భుతంగా కట్టించిన కాళేశ్వరం ప్రాజెక్టులు కళకళలాడుతున్నా, ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వానాకాలం సీజన్ మొదలై కూడా దున్నపోతుపై వానపడ్డట్లుగా ఉంది. కనీసం ప్లానింగ్ లేదు, సమీక్ష లేదు, సన్నద్ధత లేదు. ఎక్కడా ఆలోచన లేదా ప్రణాళిక కనిపించట్లేదు. ప్రణాళికా రాహిత్యం, అనుభవ లేమి, పరిపాలనలో చేతగానితనం వల్లే రాష్ట్రంలోని రైతులు ఇలాంటి అవస్థలు పడుతున్నారని విమర్శించారు. ఒక్కటంటే ఒక్క రోజు కూడా ముఖ్యమంత్రి వ్యవసాయంపై, ఎరువులపై సమీక్ష చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి విజ్ఞప్తి చేయలేదు. రాహుల్ గాంధీని కలుసుకోవడం పేరుతో కేవలం ఓ కాగితం ఇవ్వడం కాదు. సీరియస్‌గా, సింసియర్‌గా రాష్ట్ర పరిస్థితి ఏమిటి? కేసీఆర్ హయాంలో వ్యవసాయ విస్తరణ ఎలా జరిగిందో తెలుసుకోవాలి. అందుకు అనుగుణంగా ఎంత ఎరువు అవసరమో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇండెంట్ ఇవ్వలేదు. ముందస్తు ప్రణాళిక చేయలేదు. దాని ఫలితంగా రాష్ట్రంలో ఎరువుల కొరత ఏర్పడింది. కేసీఆర్ ఉన్న పదేళ్లలో ఎప్పుడూ లైన్లు ఉండలేదు. ఎరువుల కోసం కొట్లాటలు జరగలేదు. పోలీసులను పెట్టి ఎరువులు పంచే దుస్థితి ఎప్పుడూ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో రైతన్నలు ఆలోచించాలన్నారు.



## రాజీవ్ గాంధీకి సిఎం తదితరుల నివాళి

**హైదరాబాద్ :** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా... సెక్రటేరియట్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తదితరులు ఘనంగా నివాళి అర్పించారు. రాజీవ్ ఆశయాలను ముందుకు తీసుకుని వెళతామని, రాహుల్‌ను ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీలు వీహెచ్, అంజన్ కుమార్ యాదవ్, మండలి ఛీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## బొగ్గుగని కార్మిక సంఘం నేతగా కొప్పుల ఎన్నిక



**హైదరాబాద్ :** తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడిగా కొప్పుల ఈశ్వర్ నియమితులయ్యారు. సంఘం కార్యవర్గ సమావేశంలో కొప్పుల ఈశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న కవిత స్థానంలో ఈశ్వర్‌ను ఎన్నికోవడం గమనార్హం. కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యకలాపాలను పార్టీ తరఫున ముందుకు తీసుకెళ్లేందుకు భారత రాష్ట్ర సమితి నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు కవిత అధ్యక్షురాలుగా ఉండగా ఇప్పటికే ఆమెను తొలగించారు. దీంతో ఆమె కార్యకలాపాలకు దూరంగా ఉంది.

## మేడారం జాతరకు 150 కోట్లు మంజూరు

**హైదరాబాద్ :** మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించబోయే మేడారం మహా జాతరకు ఏర్పాట్లు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంజూరు చేసిన నిధుల పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ- సీఎం మల్లూ భట్టి విక్రమార్క, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ లకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.



## బోరు నుంచి ఉబికి వస్తున్న నీరు

**నిజామబాద్ :** నిజామాబాద్ జిల్లాలె ఈ సీజన్‌లో భారీ వర్షాలు కురిశాయి. దాదాపుగా అన్ని చెరువులు నిండాయి. ఎడపల్లి మండలం ధర్మారం గ్రామంలో ఓ బోరుబావి నుంచి ఎలాంటి విద్యుత్ మోటార్ వేయకుండానే నీరు ఉబికి వస్తోంది. గత మూడు రోజుల నుంచి మోటార్ ఆన్ చేయకుండానే తన పంటపొలంలో ఉన్న వ్యవసాయ బోరుబావి నుంచి నీరు వస్తోందని నవీన్ అనే రైతు తెలిపారు. వర్షాలు అధికంగా కురవడంతో భూగర్భంలో నీటి మట్టం పెరిగి బోరు నుంచి నీరు ఉబికి వస్తోందని రైతు చెప్పారు. ఈ ఘటనతో స్థానిక రైతులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. అయితే నీటి నిల్వల కారణంగా ఇలా జరుగుతుందని అధికారులు అన్నారు.

## కంచె ఐలయ్యను ఎందుకు పోటీకి పెట్టలేదు

- ఉపరాష్ట్రపతి ఎన్నికపై ఎవరూ సంప్రదించలేదు
- మేము ఏ పార్టీ కూటమిలో లేము
- యూరియా ఎవరు ఇస్తే వారికే మద్దతు ఇస్తాం
- అయినా పార్టీలో ఆలోచించి నిర్ణయిస్తాం : కేటీఆర్



**హైదరాబాద్, ఆగస్టు 20 :** ఉపరాష్ట్రపతి ఎన్నిక విషయంలో ఇప్పటి వరకు తమను ఎవరూ సంప్రదించలేదని, అలాగే తాము ఏ కూటమిలోనూ లేనందున ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 9 లోపు తెలంగాణకు ఎవరు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇస్తే వారికే తమ మద్దతు ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ రైతులకు యూరియా మోదీ ఇస్తే ఎన్డీఏకి, రాహుల్ ఇస్తే ఇండియా కూటమికి మద్దతు ఇస్తామని తెలిపారు. బీఆర్ఎస్ అనేది సర్వస్వతంత్రమైన పార్టీ. మాకు ఢిల్లీ లో ఎవరూ బాస్‌లు లేరు. మాకు ఢిల్లీ లో ఆజ్ఞాపించే, ఆదేశించేవారు ఎవరూ లేరు. మా పార్టీని ఇప్పటి వరకు ఎవరూ సంప్రదించలేదు. సెప్టెంబర్ 9న ఎన్నిక జరగనుండగా, కూర్చొని ఆలోచించి, ఎన్నికల తేదీ నాటికి మా వైఖరిని ప్రకటిస్తాం అన్నారు. మేము తెలంగాణ ప్రజల మూడ్‌కు అనుగుణంగా, వారి ఆకాంక్షలు, ప్రయోజనాల మేరకు నిర్ణయం తీసుకుంటాం. ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రేవంత్ రెడ్డి పెట్టిన వ్యక్తి అయితే మేము వ్యతిరేకిస్తాం. కాంగ్రెస్ అనే చిల్లర పార్టీ, థర్డ్ క్లాస్ పార్టీ ఎ ఇవాళ రాష్ట్ర ప్రజలను ఎంతగా విసుగుపెట్టి ఉంటుందో వారికే తెలుసు. అలాంటి థర్డ్ క్లాస్ ముఖ్యమంత్రి పెట్టిన అభ్యర్థిని మేము సమర్థిస్తామా? అని పరోక్షంగా ఇండియా కూటమి అభ్యర్థిని వ్యతిరేకించేందుకు సూచించారు. బీసీల విషయంలో మా పార్టీ చిత్తశుద్ధితో ఉంది. బలహీన వర్గాల కోసం ఢిల్లీ వరకు పోరాడతాం. మరి బీసీ అభ్యర్థిని ఎందుకు పెట్టలేదు? అంత ప్రేమ ఉన్నప్పుడు బీసీ అభ్యర్థిని పెట్టలేదు. తెలంగాణ నుంచి బీసీ అభ్యర్థి దొరకలేదా? కంచె ఐలయ్యను పెట్టాల్సిందని అన్నారు. బీసీలపై ప్రేమ మాత్రం నోట్లోనే ఉంటుంది. ఎన్నికల్లో నిలబెట్టే సరికి బీసీలు కనిపించరు వీరికి. వీరి మాటలు మేము నమ్మాలి? వీరిని మద్దతుగా నిలబెట్టాలి? వీరేమైనా మాకు మేలు చేస్తున్నారు? మాది స్వతంత్రమైన పార్టీ. మేము ఎన్డీఏలో లేము, ఇండియాలో లేము. మోదీ మా బాస్ కాదు, రాహుల్ మా బాస్ కాదు. తెలంగాణ ప్రజలే మా బాస్‌లు. వారి అభిప్రాయానికి అనుగుణంగా మా నిర్ణయం ఉంటుంది. కాంగ్రెస్, బీజేపీ ఎ రెండూ దొందూదొందే. తెలంగాణను ఇద్దరూ ముంచినవారే. 11 ఏళ్లుగా బీజేపీ ఏమీ చేయలేదు. 20 నెలలుగా కాంగ్రెస్ ఏమీ చేయలేదు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదు. ఆ ఇద్దరూ పెట్టిన అభ్యర్థులను సీరియస్‌గా తీసుకోవాలనే ఆలోచన వ్యక్తిగతంగా నాకు లేదు. కానీ, నా అభిప్రాయం పార్టీ అభిప్రాయం కాదు. పార్టీగా కూర్చొని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇన్‌చార్జీలు, రాష్ట్ర కమిటీ సభ్యులతో పాటు అవసరమైతే కేసీఆర్ తో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. వ్యక్తిగతంగా మాత్రం కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు పనికిరాని పార్టీలు. ఇవి ఢిల్లీ పార్టీలు. వీటి కోసం ఆలోచించాల్సిన అవసరం లేదనేది నా అభిప్రాయం అని తెలిపారు.



## కృష్ణ, గోదావరి ప్రాజెక్టులకు జలకళ

- సాగర్ వద్ద 26 గేట్ల ఎత్తివేత
- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

**హైదరాబాద్, ఆగస్టు 20 :** భారీ వర్షాల నేపథ్యంలో జలాశయాలకు జలకళ వచ్చింది. దాదాపు అన్ని జలాశయాలు నిండుకుండలా మారాయి. కృష్ణా, గోదావరి నదులకు వరద పోటెత్తుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు భారీగా నీరు చేరుతోంది. ఈ సీజన్‌లో సాగర్‌కు 4.10 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడం ఇదే తొలిసారి. దీంతో అధికారులు 26 గేట్లను 10 అడుగుల మేర పైకి ఎత్తి, దిగువకు నీటిని విడుదల చేశారు. ఇది కూడా ఇదే మొదటిసారి. గత మూడు రోజులుగా వరద ప్రవాహం పెరగడంతో నాగార్జునసాగర్ జలాశయంలో నీటిమట్టం అంతకంతకు పెరుగుతోంది. సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం ఇది 584.80 అడుగులుగా నమోదైంది. నీటి నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 294.858 టీఎంసీలుగా ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదతో పాటు తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఉదయం 8 గంటలకు గోదావరిలో నీటిమట్టం 43 అడుగులకు చేరుకుంది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. వరద పెరగడంతో భద్రాచలం కల్యాణకట్ట వరకు నీరు చేరింది. ప్రజలు నీటిలోకి వెళ్లకుండా జలసంరక్షణ దళాలు, గజఈతగాళ్లు, లాంచీలు ఏర్పాటుచేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాళేశ్వరం వద్ద వరద ప్రవాహం కొనసాగుతోంది. భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద వల్ల కాళేశ్వరం పుష్కర ఘాట్ల వద్ద గోదావరి, ప్రాణహిత నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఫలితంగా కాళేశ్వరం వద్ద నీటిమట్టం 12.41 మీటర్లకు చేరుకుంది. మరోవైపు పుష్కర ఘాట్ మెట్ల వద్ద ఏర్పాటు చేసిన జ్ఞానదీపాలు కొంతవరకు నీటిలో మునిగి, బాహుబలి సినిమాలోని దృశ్యాన్ని తలపిస్తున్నాయి. త్రివేణి సంగమం వద్ద వరద ప్రవాహం అధికంగా ఉండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఇక్కడ కూడా 12.41 మీటర్ల మేర వరద ప్రవాహం కొనసాగుతోంది. జ్ఞాన సరస్వతి, సాధారణ పుష్కర ఘాట్ల మెట్లపై నుంచి వరద ప్రవహిస్తోంది. త్రివేణి సంగమం వద్ద కూడా మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిలో వరద ఉండటంతో ప్రజలు జాగ్రత్త వహించాలని అధికారులు సూచిస్తున్నారు.

## శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

**నంద్యాల :** శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం మరింత పెరిగింది. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి 4,69,482 క్యూసెక్కులు చేరుతోంది. దీంతో శ్రీశైలం నుంచి 4,41,237 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 30,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 30,192 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పది స్పిల్ వే గేట్లను 14 అడుగులు ఎత్తి 3,45,730 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.10 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 215.80 టీ-ఎంసీలు కాగా ప్రస్తుతం 199.73 టీ-ఎంసీలుగా కొనసాగుతోంది.

## ఏఐ ద్వారా రెండు గంటల్లోనే దర్శనం

- శ్రీవాణి దర్శన వేళలు మారుస్తున్నాం
- వీఐపీ దర్శనాలు ఉదయం 8 నుంచి 8:30 మధ్య ముగిస్తాం
- అన్యమతస్థులు ఉంటే వీఆర్ఎస్ ద్వారా పంపిస్తాం
- టిటిడిపై భూమన పనిగట్టుకుని దుష్ప్రచారం
- టూరిజం పేరుతో రోజా టికెట్లు అమ్ముకున్నారు
- టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు



**తిరుపతి, ఆగస్టు 20 :** ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారంగా భక్తులకు రెండు గంటల్లో శ్రీవారి దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. శ్రీవాణి దర్శన సమయాలను మార్చే యోచనలో ఉన్నామని, ఉదయం టికెట్లు తీసుకుని సాయంత్రం దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. గతంలో వీఐపీ దర్శనం ఉదయం 10 గంటలకు ఉండడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పుడు వాటిని ఉదయం 8 గంటల నుంచి 8:30 గంటల మధ్యలోనే పూర్తిచేయనున్నట్లు వివరించారు. బుధవారం నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన మాట్లాడారు.

### అన్యమత సిబ్బంది చర్యలు:

టిటిడి లో పనిచేస్తున్న అన్యమత సిబ్బందిని వేరే విభాగాలకు బదిలీ చేయాలని, లేదా వాలంటరీ రిటైర్మెంట్ స్కీం (వీఆర్ఎస్) కింద పంపించే చర్యలు చేపడుతున్నామన్నారు. అన్యమత ప్రచారంలో పాల్గొనేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. "తిరుమలలో రాజకీయాలు మాట్లాడకూడదు అనే చర్యల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి," అని అన్నారు. "తిరుమల వచ్చి జగన్, భారతి ప్రసాదాలు తింటారా? తలనీలాలు ఇచ్చారా? శ్రీవారి ప్రసాదం తీసుకున్నారా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. హిందూ ధర్మంపై వైసీపీ నేతలకు గౌరవం లేదని, దాడులు చేస్తూ భక్తులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డిని "అవినీతి సామ్రాట్, డకాయిట్" గా అభివర్ణించారు. రూ.1600 కోట్ల టెండర్లు ఇచ్చి వాటిపై 10% కమీషన్ తీసుకున్నారని ఆరోపించారు. "ఆయన తిరుమలపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఆయన అవినీతి చిట్టా నా వద్ద ఉంది. సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి ఎవరికెంత టిక్కెట్లు ఇచ్చారో నాకు తెలుసు," అన్నారు. రోజా టూరిజం ముసుగులో ఒక్కో దర్శన టికెట్‌ను రూ. 5000కి విక్రయించారని ఆరోపించారు. "తిరుమలలో ఎవరి పనులు ఎలా జరిగాయో చర్చకు సిద్ధం," అని బీఆర్ నాయుడు సవాల్ విసిరారు.

### సేవా కార్యక్రమాలు - భద్రతా చర్యలు

సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఒంటిమిట్టలో అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఇందుకోసం రూ.4 కోట్లు కేటాయించామన్నారు. గత ప్రభుత్వంలో 12 మంది వైసీపీ నేతలకు తిరుమలలో హోటళ్లు కేటాయించారని, అప్పట్లో హోటల్ కేటాయింపులు మాఫియాలా జరిగాయని విమర్శించారు. ప్రస్తుతం ఈ-టెండర్ల ద్వారా పారదర్శకంగా హోటళ్లు కేటాయిస్తున్నామన్నారు. తిరుమలలో త్వరలో కొత్త క్యాంటీన్లు ప్రారంభించనున్నామని చెప్పారు. శ్రీవారి దర్శనాలు, ప్రసాదాల విషయంలో సైబర్ మోసాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామని చెప్పారు. బర్డ్ ఆసుపత్రి విస్తరణపై దృష్టి సారించామని చెప్పారు. టిటిడి పరిధిలోని 90% అటవీ ప్రాంతాన్ని మరింత పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. తిరుమల కల్యాణకట్టలో ఆధునిక పరికరాలు ప్రవేశపెడతామని చెప్పారు. తీర ప్రాంతాల్లో మతమార్పిడులు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొంటూ, వాటిని అడ్డుకోవడానికి ఆలయాల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 320 ఆలయాలు నిర్మించామని, భవిష్యత్తులో మరో 500 నుండి 1000 ఆలయాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. మిగిలిన రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాశామని, భూములు కేటాయిస్తే వెంటనే ఆలయ నిర్మాణం ప్రారంభిస్తామని చెప్పారు.

## మోసం కేసులో 'వ్యూహం' నిర్మాత దాసరి కిరణ్ అరెస్ట్

**హైదరాబాద్ :** 'వ్యూహం' సినిమా నిర్మాత దాసరి కిరణ్ ను ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్థిక లావాదేవీల విషయంలో నమోదైన ఫిర్యాదుతో విజయవాడ పటమట పోలీసులు హైదరాబాద్‌లో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం దాసరి కిరణ్‌ను విజయవాడకు తరలించారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఉంటు-న్న దాసరి కిరణ్ బంధువు గాజుల మహేశ్ ట్రావెల్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఆయన వద్ద నుంచి కిరణ్ రూ.4.5కోట్లు- అప్పుగా తీసుకున్నారు. తిరిగి ఇవ్వాలని మహేశ్ అనేక సార్లు అడిగినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఈనెల 18న విజయవాడలోని కిరణ్ కార్యాలయానికి మహేశ్, ఆయన భార్య వెళ్లారు. అక్కడ కిరణ్ అనుచరులు దాదాపు 15 మంది వారిపై దాడి చేశారు. దీంతో మహేశ్ విజయవాడ పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# పేదలపక్షపాతి.. జస్టిస్ సుదర్శన్ రెడ్డి



ఉప రాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేయడంతో ఎన్నిక అనివార్యం అయ్యింది. బలాబలాలు గమనిస్తే ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ ఎన్నిక కావడం లాంఛనమే కానుంది. ఎందుకంటే ఎన్‌డిఎ కూటమికి తగినంత బలం ఉంది. అయితే ఇక్కడ అభ్యర్థుల గుణగణాలు, వారి వ్యక్తిత్వం పరిశీలిస్తే ఇద్దరూ వజ్రం తునకలే. వారివారి రంగాల్లో వారు తమ నిజాయితీతో బతుకుతున్న వారే. ఇప్పటివరకు 16 ఉప రాష్ట్రపతి ఎన్నికలు జరిగాయి. సర్వేపల్లి రాధాకృష్ణన్, గోపాల్ స్వరూప్ పాఠక్, జస్టిస్ మహమ్మద్ హిదయతుల్లా, శంకర్‌దయాళ్‌శర్మలు మాత్రమే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన అన్ని ఎన్నికల్లో ప్రతిపక్షాలు అభ్యర్థిని నిలబెట్టాయి. ప్రధానమంత్రిగా మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత 2017లో తొలిసారి జరిగిన ఎన్నికలో అధికారపార్టీ అభ్యర్థి ఎం.వెంకయ్యనాయుడుపైన ప్రతిపక్షాలు గోపాలకృష్ణ గాంధీని నిలబెట్టాయి. 2022లో జరిగిన ఎన్నికలో జగదీప్‌ధన్‌ఖడ్‌పై కర్ణాటకకు చెందిన మార్గరెట్ అల్వాను రంగంలోకి దింపాయి. ఇప్పుడు తెలంగాణకు చెందిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేశాయి. ఈ మూడు ఎన్నికల్లో ప్రతిపక్షాల నుంచి దక్షిణాదివారే అభ్యర్థులు కావడం విశేషం.ఈ పోటీ ఎలా ఉన్నా..ఎవరు గెలిచినా విభిన్న వ్యక్తిత్వాల కలగిన ఇద్దరు వ్యక్తుల గుణగణాలను తెలుసుకునే అవకాశం కలిగింది.ప్రధానంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి న్యాయ కోవిదుడు. నిక్కచ్చిగా,నిర్మొహమాటంగా ఉండే వ్యక్తి. ఆయన సుప్రీం న్యాయమూర్తిగా ఇచ్చిన తీర్పులను పరిశీలిస్తే ఇది అర్థం అవుతుంది. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి దేశంలో పేరొందిన ప్రగతిశీల న్యాయకోవిదుడు. ఆయన సుదీర్ఘ కాలం న్యాయ వ్యవస్థలో ఎన్నో హోదాల్లో పనిచేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం నిరంతరం ధైర్యంగా పోరాడారు. ఆయన రాసిన తీర్పులను చదివితే పేదలకు అనుకూలంగా ఎలా వ్యవహరిం చారు, రాజ్యాంగాన్ని, ప్రాథమిక హక్కులను ఎలా రక్షించారన్నది తెలుస్తుంది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వెంకయ్యనాయుడు తర్వాత పోటీ చేస్తున్న రెండో తెలుగు వ్యక్తిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి నిలవనున్నారు.

జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి 1946 జులై 8న రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. 1971లో ఉస్మానియా యూనివర్సిటీలో న్యాయశాస్త్రంలో పట్టా పొంది అదే సంవత్సరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. సీనియర్ న్యాయవాది కె.ప్రతాప్‌రెడ్డి వద్ద జూనియర్‌గా చేరారు. హైదరాబాద్ సిటీ- సివిల్‌కోర్టు, హైకోర్టుల్లో న్యాయవాదిగా వృత్తి జీవితం ప్రారంభించారు. 1988-90 మధ్య హైకోర్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయవాదిగా సేవలందించారు. 1990లో సుమారు ఆరు నెలలపాటు- కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు స్టాండింగ్ కౌన్సిల్‌గానూ పనిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి న్యాయ సలహాదారుగా, స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. 1993లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1995 మే 2న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005 డిసెంబరు 5న గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2007 జనవరి 12 నుంచి 2011 జులై 7 వరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలందించారు. 2013 మార్చిలో గోవా తొలి లోకాయుక్తగా నియమితులయ్యారు. ఆనాటి గోవా సిఎం పణిక్కర్ ఏరికోరి సుదర్శన్ రెడ్డిని లోకాయుక్తకు నియమించారు. ఓ రకంగా సుదర్శన్ రెడ్డి నిజాయితీ కారణంగానే ఈ పదవి దక్కింది. ప్రస్తుతం ఐఏఎంసీ శాశ్వత ట్రస్టీగా, బీసీ కులగణన అధ్యయన కమిటీ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మానవ హక్కుల పరిరక్షణకు పెద్దపీట వేశారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పలు కీలక తీర్పులు వెలువరించారు. ఛత్తీస్‌గఢ్‌లో తీవ్రవాదులను ఎదుర్కోవడానికి ఏర్పడిన సల్వాజుడుంను నిషేధిస్తూ తీర్పు ఇచ్చారు. మానవ హక్కుల పరిరక్షణ, చట్టబద్ధ పాలన లక్ష్యంగా ఈ తీర్పు వెలువరించారు. ఆర్మీ వైద్య కళాశాలలో పదవీ విరమణ పొందిన సైనికులు, సైనిక సిబ్బంది వితంతువుల పిల్లలకు అడ్మిషన్‌లు నిరాకరించడం చెల్లదని, దీనివల్ల అణగారిన వర్గాలకు న్యాయం జరగదన్నారు. న్యాయవ్యవస్థ స్వతంత్రతను పరిరక్షిం చడంలో భాగంగా... న్యాయమూర్తులపై ఆరోపణలతో వచ్చే ప్రజాప్రయోజన పిటిషన్‌లను అనుమతించ రాదని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తిగా ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనానికి నేతృత్వం వహిస్తూ అసైన్డ్ భూసేకరణపై కీలకమైన తీర్పు వెలువరించారు. అసైన్డ్ భూములకు భూసేకరణ చట్టం కింద చట్టబద్ధమైన పరిహారం చెల్లించాలని తీర్పు వెలువరించారు.

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఇప్పటి వరకు ఉప రాష్ట్రపతిగా ఉన్న జగదీప్ దన్‌ఖడ్ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే రాజీనామా చేశారు. ఈ హఠాత్పరిణామం, ఇప్పటి వరకూ ఒక రాజ్యాంగ హోదాగా భావిస్తున్న ఉప రాష్ట్రపతి పదవి విలువపై చర్చకు దారితీసింది. మరో రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల కమిషన్ పనితీరుపై దాదాపు నెలరోజులుగా వర్షాకాల సమావేశాలు స్తంభించిపోయాయి. ప్రజల ఓట్లనే కొల్లగొడుతున్నారంటూ ప్రతిపక్షాలు వీధి ఆందోళనలకు దిగాయి. ఈ పరిస్థితుల్లో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో పోటీకి నిలబెట్టేందుకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి ఎంపిక చేసింది. గెలుపోట ములతో నిమిత్తం లేకుండా ఈ పోటీని సైద్ధాంతిక పోరుగా మార్చేందుకు, తమ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తమ నిర్ణయం దోహదపడుతుందని ఆ కూటమి నేతలు భావిస్తున్నట్లు- కనపడుతోంది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గతంలో నిజాయితీతో నడిచిన న్యాయకోవిదుడు. సుదర్శన్‌రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న నాలుగున్నరేళ్ల కాలంలో అప్పటి యూపీఏ ప్రభుత్వ నిర్ణయాలు చాలా వాటిని తప్పుపట్టారు. సహజవాయువు ప్రజలకు చెందుతుంది. దాన్ని వెలికితీసే కాంట్రాక్టర్ రిలయన్స్ కావచ్చు కాని దాని ధర ప్రభుత్వం నిర్ణయించాల్సిందేనని విస్పష్టంగా తీర్పు చెప్పిన బెంచ్‌లో ఆయన ఉన్నారు. విదేశీ బ్యాంకుల్లో దాచుకున్న నల్లధనాన్ని తిరిగి రప్పించడంలో విఫలమైన ప్రభుత్వాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆర్థిక నేరస్థులపై ప్రభుత్వం మెతకగా వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. వారిపై దర్యాప్తు చేసేందుకు సిట్‌ను నియమించాలని ఆదేశించారు. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లను ఆదివాసీలతోనే తుదముట్టించేందుకు ఏర్పర్చిన సల్వాజుడుంను రాజ్యాంగ వ్యతిరేకమని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సంచలన తీర్పు ఇచ్చారు. సామాన్యులను, ముఖ్యంగా చదువు రాని అమాయక ఆదివాసీ యువతను హింసాకాండకు పాల్పడేందుకు ప్రోత్సహించకూడదని, ఇలాంటి అనైతిక మార్గాలను రాజ్యాంగ విలువలు అనుమతించ బోవని ఆయన విస్పష్టీకరించారు. మొత్తంగా ఇప్పుడుసుదర్శన్ రెడ్డి వ్యక్తిత్వం, అతని తీర్పుల గురించి ప్రజలు తెలుసుకునే అవకాశం వచ్చింది. ఓ రకంగా ఇది సుదర్శన్ రెడ్డ ఔన్నత్యాన్ని వెలుగులోకి తీసుకుని వచ్చే ఎన్నికగా చూడాలి.

# ఆన్‌లైన్ గేమింగ్ నిషేధం తగదు

- అవసరమైతే నియంత్రణ విధించండి
- అమిత్‌షాకు ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ వినతి



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20 :** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ఆగడాలు ఇటీవల మరీ పెరిగిపోయాయి. దీన్ని అరికట్టడంలో భాగంగా 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధమైన సంగతి తెలిసిందే. ఈ బిల్లుపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ కేంద్ర హెూం మంత్రి అమిత్‌షాకు లేఖ రాసింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను అరికట్టేందుకు కేంద్రం తీసుకొచ్చే బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఏఐజీఎఫ్ ఆందోళన వ్యక్తంచేసింది. ఇది అమల్లోకి వస్తే తమ పరిశ్రమకు భారీ నష్టం జరుగుతుందని, కోట్లమంది చట్టబద్ధమైన గేమర్‌లు అక్రమంగా నెట్‌వర్క్‌లను నడిపేవారి వైపు వెళ్లేలా చేస్తుందని ఆవేదన వ్యక్తంచేసింది. అంతేకాక.. ఈ రంగంలోని అనేకమంది ఉద్యోగులపై కూడా దీని ప్రభావం ఉంటుందని హెచ్చరించింది. ఈసందర్భంగా దీన్ని పూర్తిగా నిషేధం విధించేకంటే.. దానిపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. ఆటగాళ్లను రక్షించడంతో పాటు వారు బాధ్యతాయుతంగా ఆడేలా చర్యలు తీసుకోవాలని కోరింది. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలని, పరిశ్ర మను పూర్తిగా చీకట్లోకి నెట్టేయొద్దని అభ్యర్థించింది. ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ వాడకం ఇటీవల విపరీతంగా పెరిగి పోయింది. దీనికి బానిసైన కొందరు అప్పుల ఊబిలో కూ రుకుపోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. వీటిని ప్రమోట్ చేసిన ప్రముఖులు ప్రస్తుతం దర్యాప్తు సంస్థల నుంచి విచారణ ఎదుర్కొంటున్నారు. ఈక్రమం లోనే ఆన్‌లైన్ బెట్టిం గ్‌ను నేరంగా పరిగణిస్తూ.. 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసు కువచ్చేందుకు కేంద్రం సిద్ధ మైంది. మంగళవారం ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోదం లభించిందని అధికార వర్గాలు తెలిపాయి. నేడు దీన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

# ఢిల్లీ సీఎం రేఖా గుప్తాపై దాడి

- సీఎంకు వినతిపత్రం ఇచ్చినట్లే ఇచ్చి దాడి
- చెంపపై కొట్టిన యువకుడు
- దాడిని తీవ్రంగా ఖండించిన మాజీ సీఎం అతిషి



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20 :** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి జరిగింది. సివిల్ లైన్స్‌లోని అధికారిక నివాసంలో 'జన్ సున్‌వాయ్' నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు భాజపా వర్గాలు వెల్లడించాయి. 35 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి ఈ దాడికి పాల్పడినట్లు తెలిపాయి. తొలుత అతడు కొన్ని పేపర్లను సీఎంకు అందించిన తర్వాత ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను భాజపా ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ ఖండించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

**అసలేం జరిగిందంటే..!**

ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఢిల్లీ సీఎం రేఖా గుప్తా తన అధికారిక నివాసంలో ప్రతివారం 'జన్ సున్‌వాయ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఓ యువకుడు కొన్ని పేపర్లను ముఖ్యమంత్రికి అందించాడు. అంతలోనే గట్టిగా అరుస్తూ సీఎంపై దాడి చేశాడు. దీంతో వెంటనే అప్రమత్తమైన వ్యక్తిగత భద్రతా సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని రాజ్‌కోట్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు సమాచారం. ఊహించని పరిణామంతో ముఖ్యమంత్రి షాక్‌కు గురైనట్లు తెలుస్తోంది. ఆమెను వెంటనే వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రిపై దాడిని రాజకీయ పక్షాలు ఖండించాయి. ఢిల్లీ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా మాట్లాడుతూ.. ఢిల్లీ ప్రజల కోసం తీవ్రంగా శ్రమిస్తోన్న ముఖ్యమంత్రిపై దాడి చేయడం దారుణమన్నారు. ఇది ప్రత్యర్థుల కుట్ర కావచ్చని అనుమానం వ్యక్తంచేశారు. దీనిలో ఏదైనా రాజకీయ పార్టీ ఉందా? అన్న కోణంలోనూ దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత ఆతిశీ కూడా ఈ ఘటనను ఖండించారు. ప్రజాస్వామ్యంలో హింసకు చోటు లేదన్నారు. నిందితులపై ఢిల్లీ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి క్షేమంగా ఉన్నారని భావిస్తున్నామన్నారు. ఈ దాడిని ఖండించిన ఢిల్లీ కాంగ్రెస్.. దురదృష్టకరమైన ఘటన అని పేర్కొంది. ముఖ్యమంత్రికే రక్షణ లేకుంటే సాధారణ మహిళల పరిస్థితి ఏంటని ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ ఆందోళన వ్యక్తంచేశారు.

# ఫలించిన తెలంగాణ ఎంపీల పోరాటం

- 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా
- ఎంపీలను అభినందించిన మంత్రి తుమ్మల



**హైదరాబాద్, ఆగస్ట్ 20 :** రాష్ట్రంలో రైతులకు తగినంత యూరియా సరఫరా చేయాలంటూ కేంద్రంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు చేసిన పోరాటం ఎట్టకేలకు ఫలించింది. తెలంగాణ రాష్ట్రానికి 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసేందుకు కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మొత్తం ఈ వారంలో తెలంగాణకు సరఫరా చేస్తామని సదరు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దీంతో కర్ణాటక నుంచి 10,800 మెట్రిక్ టన్నుల యూరియా షిప్ మెంట్ ప్రారంభం కానుంది. ఈ వారంలో మరో మూడు షిప్ మెంట్‌ల ద్వారా యూరియా సరఫరాకు కోరమాండల్ ఇంటర్నే షనల్ లిమిటెడ్‌కు ఆదేశాలు జారి చేసింది. రాష్ట్రంలో యూరియా కొరతపై పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ ఎంపీలు ఆందోళనలకు దిగారు. దీంతో తెలంగాణ రైతాంగం యూరియా కోసం పడుతున్న కష్టాలు దేశానికి తెలిసింది. దీంతో కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రిత్వ శాఖ స్పందించింది. కేంద్రం తెలంగాణకు భారీగా యూరియా సరఫరా చేయడంపై రాష్ట్ర ఎంపీలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. ప్రతి పక్ష పార్టీలు రాజకీయ స్వార్థం కోసం చేసే కుట్రలపై ఆలోచన చేయాలంటూ రైతాంగానికి ఆయన కీలక సూచన చేశారు. తెలంగాణకు కేటాయించిన యూరియా సకాలంలో సరఫరా చేయకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష కారణంగానే రైతులకు ఇబ్బందులు ఏర్పాడ్డాయని తెలిపారు. తెలంగాణ రైతుల శ్రేయస్సు కోసం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. తెలంగాణలో రైతులకు యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు యూరియా సరఫరా చేయకుండా కేంద్రంలోని మోదీ సర్కార్ మీనమేషాలు లెక్కిస్తుందని రాష్ట్ర ప్రభుత్వంలోని అగ్రనేతలు ఆరోపించారు. అంతేకాకుండా.. బీజేపీ యేతర పాలిత రాష్ట్రలపై మోదీ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందంటూ వారు మండిపడ్డారు. యూరియా కొరతపై దేశ రాజధాని ఢిల్లీ సాక్షిగా నిలదీయాలంటూ పార్టీ ఎంపీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం సూచించిన సంగతి తెలిసిందే.

# లోక్‌సభ ముందుకు కీలక బిల్లు..

## శశిథరూర్ కాంగ్రెస్ వ్యతిరేక బాణీ



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20 :** గత కొంతకాలంగా కాంగ్రెస్ విధానాలతో విభేదిస్తున్నారు ఆ పార్టీ ఎంపీ శశిథరూర్. తాజాగా తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న సరికొత్త బిల్లుపై కూడా ఆయన పార్టీ అధిష్ఠానానికి భిన్నంగా వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లును ప్రతిపక్ష ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనిపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ ఈ బిల్లు క్రూరమైనదన్నారు. అన్యాయంగా ముఖ్యమంత్రులను అరెస్టు చేస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. అయితే, విపక్షాలు ఈ బిల్లును వ్యతిరేకించడాన్ని శశిథరూర్ తప్పుబట్టారు. 'ఇది ఇంగిత జ్ఞానానికి సంబంధించిన విషయం. ఇందులో నాకు ఎలాంటి తప్పు కన్పించడం లేదు' అని ఓ వార్తా సంస్థతో పేర్కొన్నారు. ఈ బిల్లును మరింత అధ్యయనం చేసేందుకు సెలక్ట్ కమిటీకి పంపే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై థరూర్ మాట్లాడుతూ.. అది ఎంతో మంచి విషయమన్నారు. అది మన ప్రజాస్వామ్యానికి ఎంతో మేలు చేస్తుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లు ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు.

## భద్రాచలం వద్ద ప్రమాదస్థాయిలో గోదావరి

**భద్రాచలం, ఆగస్ట్ 20 :** భద్రాచలం వద్ద గోదావరి ఉగ్ర రూపం దాల్చుతుంది. మొదట ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి నీటి ప్రవాహం ఉంది. ప్రస్తుతం అక్కడ 43.5 అడుగుల నీటిమట్టం నమోదైంది. తెలంగాణాలోని లక్ష్మీ బ్యారేజ్ నుంచి 9.04 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో భద్రాచలానికి నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ప్రతి అరగంటకు అక్కడ ప్రవాహం పెరుగుతోంది. దీనికి తోడు ప్రాణహిత నుంచి వరద నీరు భారీగా చేరడంతో ఉధృతంగా మారింది. ఇదే సమయంలో ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద నీటి ప్రవాహం స్థిరంగా ఉంది. ప్రస్తుతం కాటన్ బ్యారేజ్ వద్ద 9.90 అడుగుల నీటి మట్టం నమోదైంది. బ్యారేజీకి చెందిన 175 గేట్లు- పైకి లేపి సముద్రంలోకి 7.40 లక్షల క్యూసెక్కులని విడుదల చేస్తున్నారు. సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ వద్ద కూడా నీటి ప్రవాహం మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు.

## కాళేశ్వరం వద్ద త్రివేణి సంగమం ఉధృతి

**భూపాలపల్లి, ఆగస్ట్ 20 :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద వరద పోటెత్తింది. ఇక్కడ 12.41 మీటర్ల మేర ప్రవాహం కొనసాగుతోంది. జ్ఞాన సరస్వతి, సాధారణ పుష్కర ఘాట్ల మెట్లపై నుంచి వరద ప్రవహిస్తోంది. త్రివేణి సంగమం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిలో వరద ప్రవాహం ఉండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

**విజయవాడ, ఆగస్ట్ 20 :** కృష్ణా, గోదావరి నదులకు వరద ప్రవాహం పెరిగింది. ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నదని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. ప్రస్తుత ఇన్ ఎ÷-లో, ఔట్ ఫ్లో 4.92 లక్షల క్యూసెక్కులుగా ఉంది. గోదావరిలో నీరు ప్రవహిస్తున్నది. భద్రాచలం వద్ద నీటిమట్టం 42.2అడుగులు ఉండగా, ధవళేశ్వరంలో కాటన్ బ్యారేజి వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 7.38లక్షల క్యూసెక్కులుగా ఉంది. ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికార యంత్రాంగం హెచ్చరించింది. సహాయక కార్యకలాపాలకు రూ.16 కోట్లు- మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. రక్షణ చర్యలకు ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధం చేశారు. కృష్ణా, గోదావరి నదిపరీవాహక లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## భారీ వర్షాలతో చెరువులకు జలకళ

**అలుగు పోస్తున్న పలు జలాశయాలు**

**కామారెడ్డి, ఆగస్ట్ 20 :** ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కామారెడ్డి జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు నిండుకుండలా మారాయి. జిల్లాలోని 414 చెరువులు అలుగు పారుతున్నాయి. 15 రోజుల కిందటివరకు జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువుల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో నీటి నిల్వలు లేవు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో జలాశయాల్లోకి భారీగా నీళ్లు చేరాయి. ఎగువన ఉన్న సింగూర్, పోచారం ప్రాజెక్టుల నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 3 రోజులుగా భారీగా వరద వస్తోంది. నిజాంసాగర్ లో దాదాపు పూర్తిస్థాయిలో నీరు చేరింది. నిజాంసాగర్ ఫుల్ కెపాసిటీ- 17.8 టీ-ఎంసీలుకాగా ప్రస్తుతం 15.943 టీఎంసీల నీరు ఉంది. మంగళవారం సాయంత్రం వరకు ఇన్ ఫ్లో 80వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. మంగళవారం 16 గేట్లు- ఎత్తి 85 వేల క్యూసెక్కుల నీటిని మంజీరానదిలోకి వదిలారు. కౌలాస్ నాలా ప్రాజెక్టు కెపాసిటీ- 1.237 టీ-ఎంసీలకు గాను ప్రస్తుతం 1.164 టీ-ఎంసీల నీరు నిల్వ ఉంది. 5 గేట్లు- ఎత్తి వరద నీటిని బయటకు వదిలారు. కళ్యాణి ప్రాజెక్ట్ లో పూర్తి నీటిమట్టం 409 మీటర్లు కాగా 408 మీటర్ల వరకు నీరుంది. సింగీతం రిజర్వాయర్ పూర్తిగా నిండింది. దీని పూర్తి మట్టం 416 మీటర్లు కాగా 416 మీటర్ల వరకు నీరు నిల్వ ఉంది. పోచారం, కళ్యాణి, కౌలాస్ సింగీతం రిజర్వాయర్ లు నిండాయి. వానకాలం, యాసంగి పంటలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందనుంది. జిల్లాలో మొత్తం 1,515 చెరువులు ఉండగా దాదాపు సగం చెరువులు నిండాయి. 173 చెరువుల్లో 25 శాతం వరకు నీరుండగా, 262 చెరువులు 25 నుంచి 50 శాతం వరకు వరకు నిండాయి. 356 చెరువుల్లో 50 నుంచి 70 శాతం వరకు, 260 చెరువుల్లో 75 నుంచి 100 శాతం వరకు నీళ్లు ఉన్నాయని ఇరిగేషన్ ఆఫీసర్లు చెప్తున్నారు. 414 చెరువులు అలుగుపారుతున్నాయి.



## గోపరాజుపల్లి నుండి వేములకొండ వరకు మెటల్ రోడ్డు నిర్మాణం చేయాలి

### సిపిఎం డిమాండ్

**వలిగొండ రాజముద్ర న్యూస్:** గోపరాజుపల్లి నుండి వేములకొండ వరకు మెటల్ రోడ్డును నిర్మాణం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు.బుధవారం రోజున గోపరాజు పల్లి గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో గుంతల మయమై నీటితో నిండిన వేముల కొండకు వెళ్లే మట్టి రోడ్డును పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి స్వామి మాట్లాడుతూ గోపరాజు పల్లి గ్రామం నుండి వేములకొండకు వెళ్లే మట్టి రోడ్డు వెంట అనేక మంది రైతులు తమ పంట పొలాలకు వెళుతుంటారని పెద్ద స్థాయిలో గుంతలు పడి వాటిలో నీరు నుండి రైతులు ఆ రోడ్డు వెంట ప్రయాణించే ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఎక్కడ ఏ గుంట ఉందో అర్థం కాని, ఎక్కడ పడిపోతారో తెలియని పరిస్థితి ఉన్నదని వెంటనే స్థానిక అధికారులు ఎమ్మెల్యే పట్టించుకోని గోపరాజుపల్లి నుండి వేములకొండ వరకు మునిపంపులకు వెళ్లే రోడ్లకు మెటల్ రోడ్డు మంజూరు చేసి నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో సీసీ రోడ్డుపై కొద్ది వర్షం వచ్చిన నీరు నిలిచి ప్రయాణికులపై పడుతుందని వెంటనే నూతన సిసి రోడ్డు పోయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి ఏనుగుల నరసింహ, కెవిపిఎస్ మండల అధ్యక్షులు ఏటెల్లి నరసింహ, పిఎన్ఎమ్ మండల అధ్యక్షులు రుద్రపల్లి రామలింగం, పార్టీ నాయకులు సలిగంజి నరసింహ,రుద్రపల్లి లింగయ్య, రైతులు యాస యాదిరెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

## గణేష్ మండపాలు ఏర్పాటులో ఆన్లైన్ ద్వారా అనుమతి పొందాలి

- మండపాలలో డిజెలకు అనుమతి లేదు
- నవాబుపేట్ ఎస్ ఐ జి. పుండ్లిక్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** గణేష్ మండప నిర్వాహకులు పోలీసు శాఖ వారు రూపొందించిన పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని పోలీసు వారికి సహకరించాలని నవాబు పేట్ ఎస్ ఐ జీ. పుండ్లిక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖ వారు రూపొందించిన గణేష్ మండపం నిర్వహణకు సంబంధించిన ఆన్లైన్ అప్లికేషన్ అనేది కేవలం మండపం నిర్వహణ, మండపంనకు సంబంధించిన సమాచారం కొరకు మాత్రమే రూపొందించిందని అన్నారు. ఈ సమాచారం ద్వారా భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసు అధికారులకు సులువుగా ఉంటుందని, ఆన్లైన్ ఇన్ఫర్మేషన్ కు ఎటువంటి రుసుము లేదని ఎస్సై తెలిపారు. గణేష్ ఉత్సవాల నిర్వాహకులు గణేష్ విగ్రహాల ఏర్పాటు సమాచారం ఆన్లైన్ లో పొందుపరిచి పోలీసుస్టేషన్ల లో సమాచారం ఇవ్వాలని అన్నారు. వినాయక మండపాల నిర్వాహకులకు ఎస్సై పలు సూచనలు చేయడం జరిగింది. మండపం ఏర్పాటు చేసే సమయం లో షార్ట్ సర్క్యూట్ జరుగకుండా మంచి నాణ్యత గల వైరును ఉపయోగించి పలు జాగ్రతలు పాటించాలని తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్ల ను మండపంలో ఏర్పాటు చేయాలని తమ పరిధిలోని పోలీస్ అధికారుల ఫోన్ నెంబర్ లు కల్గి ఉండాలని పేర్కొన్నారు. మండపాల్లో ఎట్టిపరిస్థితులోను డిజేలను ఏర్పాటు చేయరాదని తెలిపారు. గణేష్ ప్రతిమలు కూర్చుండబెట్టే ప్రదేశంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా షెడ్ నిర్మాణంలో మంచి నాణ్యత పాటించాలని తెలిపారు. గణేష్ మండపంలో 24 గంటలు ఒక వాలంటీర్లు ఉండే విధంగా నిర్వహకులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. గణేష్ మండపాలకు వచ్చే భక్తుల సందర్శను దృష్టిలో వుంచుకోని మండపాలలో భక్తుల ఇబ్బందులు కలగకుండా క్యూలైన్ల కోసం ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలన్నారు. గణేష్ మండపాల వద్ద ఎప్పుడైన ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వాహకులు తప్పనిసరిగా తమ మండపాలలో పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి, పోలీసు అధికారులతనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం చేస్తారని పేర్కొన్నారు మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు, వ్యక్తులు కనిపించినట్లుయితే తక్షణమే డయల్ 112 గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి రూమర్స్, వదంతులను నమ్మకూడదని, గణేష్ మండపాల ఏర్పాటు కొరకు పోలీస్ శాఖ అనుమతి నిమిత్తం https://policeportal.tspolice.gov.in/ index.htmఈ లింకు ద్వారా సంప్రదించగలరు అని తెలిపినారు.

## దేశ యువతకు రాజీవ్ ఒక స్ఫూర్తి

### ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** అతి చిన్న వయసులోనే తల్లి ఇందిరాగాంధీ మరణాంతరం దేశ ప్రధాని గా బాధ్యతలు స్వీకరించి దేశానికి ఐటీ రంగాన్ని తీసుకువచ్చి విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ది అని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు.బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ సమీపంలో ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ 79 వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. భారతదేశానికి ప్రధానిగా ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చి, బడుగు బలహీన వర్గాలకు పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. కంప్యూటర్లు,సెల్ ఫోన్లు, టెలికాం,ఐటీ రంగాల్లో భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మహా నేత రాజీవ్ గాంధీ అని కొనియాడారు.ఆయన ఆశయా ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు నడవాలన్నారు. గ్రామ సీమలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మా గాంధీ మాటలను రాజీవ్ నిజం చేశారన్నారు.దేశంలో మహిళలకు స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. దేశంలో యువకులకు రాజీవ్ గాంధీ స్ఫూర్తి అని,యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కును కల్పించడమే కాకుండా ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రగడ అనురాధ కిషన్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, దండు మైసమ్మ ఆలయం చైర్మన్ కరుణాకర్ రెడ్డి బైరు శైలేందర్, వెన్న మధుకర్ రెడ్డి,నాగుల వాసు, అన్నమయ్య రాము,రుద్రంగి రవి,పంతంగి దశరథ, మద్దెబోయిన శ్రీనివాస్,పొలగాని బాలు, కోడి శివ,కోల నాగరాజు, పిడమర్తి నాగరాజు,కస్పరాజు రమేష్, దివ్య, గుణగంటి వంశీ, యాదగిరి, మాధవి, నవీన్, రమేష్ పాల్గొన్నారు.

# పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

- అటువైపు కన్నెత్తి చూడని స్పెషల్ ఆఫీసర్లు
- పారిశుద్ధ్యంపై విధి కార్యదర్శిది కాదా..?
- ఇలా అయితే డెంగ్యూ మలేరియా వ్యాధులు ప్రబలే అవకాశం



**వలిగొండ రాజముద్ర న్యూస్:** ప్రభుత్వాలు మారి సుమారు 20 నెలలు అవుతున్నప్పటికీ గ్రామాల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు పారిశుద్ధ్యం పడకేసింది. సరిగ్గా అటువంటి ఘటనే వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో వీరవెల్లికి వెళ్లే దారిలో ఇళ్లపక్కనే కనిపించిన దృశ్యం ఇందుకు నిదర్శనం.గత ప్రభుత్వ కాలం నుండి ప్రస్తుత ప్రభుత్వం పాలన వరకు గ్రామపంచాయతీలో ఒక్క రూపాయి డబ్బులు లేకపోవడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. రానున్న వర్షాకాలంను దృష్టిలో ఉంచుకుని పారిశుధ్యం పై దృష్టి సారించకపోతే అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నట్లు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీలో నిధులు ఉంటే పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు పంచాయతీ అనుసంధానంగా ఉన్న ట్రాక్టర్ను సైతం గ్రామంలో తిప్పడానికి అవకాశం ఉండేది. ప్రస్తుత కాలంలో వారు ఆర్థిక భారంతో విధులు నిర్వహించలేక, చేతులెత్తాల్సిన పరిస్థితి నెలకొంది.జిల్లా అధికారులు పదేపదే సమీక్ష సమావేశం నిర్వహిం చడం తప్ప, పంచాయతీలకు ఒక్క రూపాయి నిధులు కూడా విడుదల చేయకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు ఏమి చేయలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం తాండవిస్తే చక్కదిద్దాల్సిన పంచాయతీలు, నిధులు లేక నీలుగుతున్నాయి. గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్లు నియమించినప్పటికీ గ్రామ పంచాయతీ లో నిధులు లేక వారు సైతం గ్రామాల వైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేకుండా పోయింది.ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శులు గత రెండు సంవత్సరాల నుంచి నిధులు రాకపోవడంతో పని భారం తో పాటు ఆర్థిక భారం కూడా మాపై మోపుతుందని, త్వరలో సమ్మెకు దిగడానికి సైతం వెనకాడ ఇది లేదంటూ సమ్మె కు సన్నాహాలు చేస్తున్నారు.రానున్న వర్షాకాలంని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేసి పారిశుద్ధ్య కార్యక్రమాలు,తాగునీటి సమస్య,తదితర సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## అనుమతులు లేకుండా స్కానింగ్ సెంటర్లు

- గర్భిణీ మహిళ మృతి.. ఏడుగురు నిందితుల అరెస్ట్
- లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన చేయించుకున్న చట్టపరమైన చర్యలు
- సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** లింగ నిర్ధారణ నేరమని అర్హత లేకుండా వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ మద్దిరాల మండలం గోరట్ల గ్రామానికి చెందిన బయగల శ్రీను భార్యకు కడుపు నొప్పి రావడంతో తుంగతుర్తి మండల కేంద్రంలోని శ్రీ సాయి హాస్పిటల్ కి తరలించి వైద్య పరీక్షలు చేయించారని తెలిపారు.తీవ్ర అవస్థత గురి కావడంతో మెరుగైన చికిత్స కోసం ఖమ్మం జిల్లాకు తరలించడంతో మార్గ మధ్యలో చనిపోవడంతో బండి శ్రీనివాస్ ఆర్ఎంపీ డాక్టర్ కారకుడని ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేశామని అన్నారు.శీను భార్య విజితకు అప్పటికే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని మూడోసారి గర్భం దాల్చడంతో ఖమ్మంలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయగా ఆడపిల్ల అని తెలిసిందన్నారు. దీంతో తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ ఆర్ఎంపీ డాక్టర్ బండి శ్రీనివాసుని సంప్రదించగా అబార్షన్ చేయాలని చెప్పారని తెలిపారు ఆర్ఎంపీ డాక్టర్లు బండి శ్రీనివాస్, పానుగంటి సతీష్ లు గర్భవతికి అబార్షన్ చేయడంతో వైద్యం వికటించి మృతి చెందిందని తెలిపారు. ఖమ్మం లోని కల్పన క్లినిక్ లో పోలంపల్లి కల్పనను నర్సు అరుణని స్కానింగ్ చేసే అశోక్ ని స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడు పులి వీరభద్రరావుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండ్ కి పంపుతున్నట్లు చెప్పారు.ఈ సమావేశంలో తుంగతుర్తి సీఐ నరసింహారావు,ఎస్సై కాంత్ కుమార్ సిబ్బంది ఉన్నారు

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి 1 రోజు జైలు శిక్ష

- ఐదుగురికి (05) జరిమానా
- సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జిల్లా ఎస్పీ, నరసింహ,ఐ పి ఎస్ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతంలో వాహనాల తనిఖీలు చేపట్టారు.ఇందులో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తూ లిఆరుగురికి (06) పట్టుబడినట్లు ఎస్సై సాయిరాం తెలిపారు.పట్టుబడిన వారిని 20-08-2025 నాడు కోర్టులో హాజరు పరచగా సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బి.వి.రమణ ఒక్కరికి ఒక్క రోజు జైలు శిక్ష 2,000 జరిమానా అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన మిగతా ఐదు మందికి (05) కలిపి 7,500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పినట్లు ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడే వారికి చలానాలు విధించడంతో పాటు కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పర్వతాపూర్ అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షులుగా యాసారం సాయికుమార్ ఏకగ్రీవ ఎన్నిక
- ప్రధాన కార్యదర్శిగా పి. మహేష్, కోశాధికారిగా కె. హరీష్ కుమార్ నియామకం




**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్ గ్రామ అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులుగా యాసారం సాయికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా పి. మహేష్, ఉపాధ్యక్షులుగా బద్దుల సురేష్, కోశాధికారిగా కె.హరీష్ కుమార్, ప్రచార కార్యదర్శిగా ఎన్. లింగస్వామి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు యాసారం సాయికు మార్ మాట్లాడుతూ... గ్రామ యువతలో ఐకమత్యం, అభివృ ద్ధి, సేవా కార్యక్రమాలను మరింత బలపర్చడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరితో మమేకమై అందరినీ కలుపుకొని పోతూ సామాజిక సేవా కార్యక్రమాలకు



అధిక ప్రాధాన్యతనిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. "డా. బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనల ఆధర్శంగా సంఘం ముందుకు నడిపించడానికి కృషి చేస్తానని, యువత సామాజిక సేవలో ముందుండేలా ప్రోత్సహిస్తానని తెలిపారు. గ్రామ పెద్దలు, నాయకులు, యువత భారీగా హాజరై కొత్త కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో యాసారం కృష్ణ, యాసారం ప్రభాకర్, మిరియాల మైసయ్య, పాండు, యాసారం నాగేష్, అడల అమర్నాథ్, నానాపురం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతినగర్‌లో అక్రమ నిర్మాణాలు..?

- నా నిర్మాణాన్ని ఆపేదెవరు అంటున్న అక్రమ నిర్మాణదారుడు
- అడ్డుకోలేక పోతున్న అధికారులు..?
- కాసుల కక్కుర్తే కారణమా...!



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :** మహానగరంలో అక్రమ నిర్మాణాలు జోరు అంతా ఇంతా లేదు. ఒకవైపు వరదలు వచ్చి నగరమంతా మునిగిపోతున్న ఎవరేమైపోతే నాకేంటి మేం మాత్రం బిల్డింగ్ కట్టుకుంటం అమ్ముకుంటాం వెళ్లిపోతాం అనే నినాదంతో కొంతమంది అక్రమ నిర్మాణదారులు అడ్డ దారుల్లో పరిమితులు తెచ్చుకుని ఉన్నవాటికి రెండింతలు అనగా పరిమితి మూడు ఫ్లోర్లకి ఉంటే అదనంగా మరో మూడు ఫ్లోర్లు నిర్మిస్తున్నారు.కూకట్పల్లి సర్కిల్ పరిధిలోని శాంతి నగర్ లో ఒక నిర్మాణ దారుడు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లోని పట్టణ ప్రణాళికా విభాగం నుండి కొంతమేరకు మాత్రమే అనుమతులు తీసుకొని అదే జిహెచ్ఎంసి నిబంధనలను తుంగలో తొక్కుతూ తనకు అడ్డెవరు లేరంటూ ఏకంగా ఆరంతస్తుల నిర్మాణాన్ని చేపట్టాడు. రవ్వంత కూడా సెట్బాకులు వదలకుండా అంతా నా ఇష్టం అన్నట్లుగా బిల్డర్ వ్యవహార శైలి ఉందని స్థానికంగా సమాచారం. అంతేకాదు నా వెనకాల హేమాహేమీలే ఉన్నారు ఆ నిర్మాణాన్ని ఎవరు టచ్ చేయాలన్న ఒకటికి పది సార్లు ఆలోచించుకోవాలి అని సదరు బిల్డర్ ధీమా వ్యక్తం చేస్తున్నాడట. ఏ విధమైన రూల్స్ నా బిల్డింగ్ కి వర్తించవు.. ఎందుకంటే స్థానిక టౌన్ ప్లానింగ్ సెక్షన్ మొత్తం నా అండర్ లో ఉంది అన్నట్లుగా సదరు నిర్మాణ దారుడు వ్యవహరిస్తున్నాడని సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సదరు నిర్మాణం పై చర్యలు తీసుకోకపోతే.. కాసులకు కక్కుర్తి పడిన అధికారులు సదరు నిర్మాణదారుడికి అమ్ముడు పోయారు కాబట్టే.. నగరం నడిబొడ్డున అంత పెద్ద నిర్మాణం జరుగుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదు అని స్థానికులు అనుకునే అవకాశం లేకపోలేదు. కనుక వీలైనంత త్వరగా అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకొని ప్రభుత్వ అధికారులు ఎవరికీ అమ్ముడు పోలేదు అని నిరూపించాలని స్థానికులు కోరుతున్నారు.



## వర్షం పడితే చాలు పైకప్పుపై నిలుస్తున్న వర్షపు నీరు

- నిలిచిన నీటి ద్వారా పైకప్పు కు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందంటున్న ప్రజలు
- పైకప్పు పై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలి

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వర్షం పడితే చాలు పైకప్పు పై వర్షపు నీరు చేరి పైకప్పు శిథిలావస్థకు చేరే అవకాశం ఉంటుందని మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రి భవనంపై వర్షపు నీరు నిలవడం ద్వారా పైకప్పు తొందరగా పాడయ్యే అవకాశం ఉందంటున్నారు. వర్షం నీరు నిలవడం ద్వారా పైకప్పులో నుండి నీరు లీకేజీ ఏర్పడడమే కాకుండా పైకప్పు భాగంలో పిచ్చి మొక్కలు మొలిచి ఆ భవనం పతనానికి దారి తీస్తుందన్నారు. పశువుల ఆసుపత్రి సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పైకప్పు భాగం పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పశువుల ఆసుపత్రి పైభాగంపై నీరు నిలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.



## జహంగీర్ పార్థివ దేహానికి నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి

**భువనగిరి, రాజముద్ర న్యూస్:** భువనగిరి మండల పరిధిలోని తాజ్ పూర్ గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ నాయకులు ఎస్ కే జహంగీర్ చిన్నేరు వాగు నీటిలో ప్రమాదవశాత్తు పడి మరణించారు . మృతి చెందిన జహంగీర్ పార్థివ దేహాన్ని మాజీ శాసన సభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు . మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు . ఈ మండల పార్టీ అధ్యక్షులు పాండు, మాజీ జడ్పీటీసీ మల్లయ్య, మాజీ ఎంపీపీ రమేష్, మండల ప్రధాన కార్యదర్శి ఓం ప్రకాష్ గౌడ్, జిల్లా నాయకులు డా. ర్యాకల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సురేష్, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు బి ఆర్ ఎస్ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అత్యాధునిక క్షిపణులు సిద్ధం చేస్తున్న చైనా..

**చైనా :** చైనా క్షిపణి రేసులో మిగిలిన దేశాల కంటే చాలా వేగంగా దూసుకుపోతోంది. వచ్చే నెల బీజింగ్‌లో జరగనున్న రెండో ప్రపంచయుద్ధం ముగింపు దినోత్సవం సందర్భంగా నిర్వహించే విక్టరీ డే పరేడ్ కోసం వీటిని సిద్ధం చేస్తోంది. చాలా సరికొత్త ఆయుధాలను నాడు ప్రపంచం ముందు ఆవిష్కరించనున్నట్లు ఆ దేశ మీడియా వెల్లడించింది. వందల మంది పీఎల్‌ఏ సైనికులు, ఫైటర్ జెట్లు, బాంబర్లు, ఇతర పరికరాలు ఈ ప్రదర్శనలో ఉండనున్నట్లు చైనా సైనిక అధికారులు తెలిపారు. ఈ పరేడ్‌లో ప్రదర్శించనున్న ఆయుధాలు మొత్తం దేశీయంగా తయారుచేసేవేనని గ్లోబల్ టైమ్స్ పేర్కొంది. 45 కంటింజెంట్లతో దాదాపు 70 నిమిషాల పాటు సాగే ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జిన్‌పింగ్ పాల్గొననున్నారు. సెప్టెంబర్ 3వ తేదీన జరగనున్న ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సరికొత్త క్షిపణులను బాహ్య ప్రపంచానికి చూపించనున్నట్లు వార్తలొస్తున్నాయి. వీటిల్లో వైజే సిరీస్‌లోని 15, 17, 19, 20 మోడళ్లు ఉండనున్నాయి. ఈ సిరీస్‌లోని క్రూయిజ్ క్షిపణులను భూమి, ఆకాశం, నౌకలు, సబ్‌మెరైన్ల నుంచి ప్రయోగించవచ్చు. వీటిల్లో వైజే-15ను సూపర్ సోనిక్ యాంటీషిప్ మిసైల్‌గా భావిస్తున్నారు. వీటి చిత్రాలు కొన్ని వెలుగులోకి రావడంతో.. డిజైన్లపై ఆన్‌లైన్‌లో చర్చిస్తున్నారు

### మొదట అణ్వాయుధాలు వినియోగించం..

చైనా అత్యంత వేగంగా అణ్వస్త్రాలను విస్తరిస్తోంది. ఈ క్రమంలో ఆ దేశం మొదటగా అణ్వాయుధాలు వాడమని.. అదే సమయంలో అణు రహిత దేశాలను బెదిరించము అని పేర్కొంది. తాజాగా దీనిపై చైనా రక్షణశాఖ స్పందిస్తూ "అణు యుద్ధంలో విజయం సాధించలేము.. అసలు దానిని చేయకూడదు. అందుకే చైనా ఆత్మరక్షణ కోసమే అణు వ్యూహాన్ని పాటిస్తుంది.. తొలుత ఆ ఆయుధాలు వినియోగించదు" అని పేర్కొంది. అంతేకాదు.. అంతర్జాతీయ సమాజాన్ని తప్పుదోవ పట్టించేలా చైనాను అణు బూచిగా చూపుతూ ప్రచారం చేయడాన్ని వ్యతిరేస్తామంది. ఈ ఏడాది మార్చిలో అమెరికా వ్యూహాత్మక కమాండ్ జనరల్ ఆంటోనీ కాటన్ కాంగ్రెస్‌తో మాట్లాడుతూ 2027 నాటికి తైవాన్‌ను స్వాధీనం చేసుకొనేందుకు సైన్యం సిద్ధంగా ఉండాలని చైనా అధినేత జిన్‌పింగ్ ఆదేశించారన్నారు.




## 'పాక్‌కు అది సిగ్గు చేటు'..

### దాయాది దురాగతాలను ఎండగట్టిన భారత్

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్‌లో మైనారిటీ వర్గాల మహిళలపై లైంగిక హింస నేటికీ కొనసాగుతోందని భారత్ ఆందోళన వ్యక్తంచేసింది. మునుపటి తూర్పు పాకిస్థాన్‌లో వేలాది మంది మహిళలపై దారుణమైన నేరాలకు పాల్పడిన చరిత్ర పాక్ సైన్యానిదని, అయినప్పటికీ వారిపై చర్యలు శూన్యమని దుయ్యబట్టింది. ఆ దురాగతాలు నేటికీ కొనసాగుతున్నాయని ఐరాస వేదికగా మండిపడింది. "1971లో మునుపటి తూర్పు పాకిస్థాన్‌లో వేలాది మంది మైనారిటీ వర్గాల మహిళలపై దారుణమైన లైంగిక హింసకు పాల్పడిన చరిత్ర పాక్ సైన్యానిది. అయినప్పటికీ నిందితులపై ఎటువంటి శిక్షలు విధించకపోవడం సిగ్గుచేటు. అటువంటి దుర్భర పరిస్థితి నేటికీ పాక్‌లో కొనసాగుతోంది. మహిళల అపహరణ, అక్రమ రవాణా, బాల్య వివాహాలు, లైంగిక హింస, బలహీన వర్గాల మహిళ బలవంతపు మతమార్పిడిలు, బాలికలపై వేధింపులకు సంబంధించి ఐరాస మానవ హక్కుల కమిషన్ తోపాటు ఎన్నో అంతర్జాతీయ సంస్థలు తమ నివేదికల్లో వివరించాయి" అని ఐరాసలో భారత రాయబారి ఎల్డోస్ మాథ్యూ పున్నూస్ వెల్లడించారు. ఐరాస భద్రతా మండలిలో 'సంఘర్షణ-సంబంధిత లైంగిక హింస' అనే అంశంపై పున్నూస్ ప్రసంగిస్తూ పాక్ తీరును ఎండగట్టారు. గతంలో బంగ్లాదేశ్‌లో మహిళలపై పాకిస్థాన్ సైన్యం చేసిన దురాగతాలను ప్రపంచం ముందుంచారు. వీటికి అక్కడి న్యాయవ్యవస్థ కూడా వంత పాడుతోందని విమర్శలు గుప్పించారు. క్రూరమైన చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన ఆయన.. హేయమైన చర్యలకు పాల్పడే వారిని శిక్షించాలన్నారు. సంఘర్షణ ప్రాంతాల్లో లైంగిక హింస అనేది వ్యక్తిగత జీవితాలను నాశనం చేయడమే కాకుండా సమాజంలోనూ భయాలను సృష్టిస్తుందన్నారు. ఇటువంటి అంశాలకు పరిష్కార మార్గం చూపిన దేశాల్లో భారత్ ఒకటని, సెక్రటరీ జనరల్ ట్రస్ట్ ఫండ్‌కు సాయం అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు.

## సభలో ప్లకార్డులు, బ్యానర్లు నిషేధం

- సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించొద్దు
- విపక్షాలకు స్పీకర్ ఓం బిర్లా సూచన

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20 :** జూలై 21న ప్రారంభమైనప్పటి నుంచి ఉభయ సభల్లో బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ పక్రియపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం చర్చకు అంగీకరించడం లేదు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ హౌస్‌లో, వెలుపల ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని నిరసనలు కొనసాగిస్తున్నారు. వారి నిరసనలతో పార్లమెంటు దద్దరిల్లుతోంది. దీంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభను వాయిదాల పర్వం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో హౌస్‌లోకి బ్యానర్లు, ప్లకార్డులను తీసుకురావద్దని ప్రతిపక్ష ఎంపీలను బుధవారం లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా కోరారు. చర్చలు సజావుగా సాగేందుకు ప్రతిపక్ష సభ్యులు సహకరించాలని స్పీకర్ కోరారు. ఎస్ఐఆర్‌పై చర్చకు డిమాండ్ చేస్తూ.. ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో సభకు అంతరాయం కలిగిందని స్పీకర్ తెలిపారు. కాగా, ఈ సందర్భంగా చెక్క కర్రలతో కట్టిన బ్యానర్లు సభలో సముచితం కాదు. మీలో చాలామంది నినాదాలు చేస్తారు, కర్రలు, ప్లకార్డులు, బ్యానర్లు తీసుకువస్తారు. కానీ వీటిని ఇలా సభకు తీసుకురావడం తగిన చర్య కాదు. మీరందరూ రాజకీయ పార్టీలకు చెందినవారు కాబట్టి.. మీరు సభకు సహకరించాలి అని స్పీకర్ ఓంబిర్లా ప్రతిపక్ష సభ్యులనుద్దేశించి వ్యాఖ్యానించారు.

## భారత్ విషయంలో అమెరికా తీరు అన్యాయం

### రష్యా దౌత్యవేత్త రోమన్ బబుష్కిన్



**రష్యా :** తమ దేశం నుంచి చమురు కొనుగోలు అంశంలో భారత్‌పై అమెరికా వైఖరి అన్యాయంగా ఉందని రష్యా ఆరోపించింది. ఈమేరకు ఆ దేశ దౌత్యవేత్త రోమన్ బబుష్కిన్ పేర్కొన్నారు. భారత్-రష్యా మధ్య ఇంధన సహకారం భవిష్యత్తులోను కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రస్తుతం న్యూదిల్లీ సవాళ్లతో కూడిన పరిస్థితిని ఎదుర్కొంటోందన్నారు. భారత్‌తో సంబంధాలపై పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు. అమెరికా ఆర్థికవ్యవస్థలను ఆయుధంలా వాడుతోందని విమర్శించారు. వాస్తవానికి మిత్రులు ఎప్పుడూ ఆంక్షలు విధించరని వాషింగ్టన్‌ను దెప్పిపొడిచారు. రష్యా భవిష్యత్తులోను భారత్ అలాంటి చర్యలు తీసుకోదన్నారు. భారత్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా చమురు సరఫరా చేసేందుకు మాస్కో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేసిందన్నారు. ప్రస్తుతం సగటున 5 శాతం డిస్కౌంట్‌తో భారత్ అవసరాల్లో 40శాతం సరఫరా చేస్తున్నామన్నారు. అమెరికా మార్కెట్లకు ఎగుమతి చేసేందుకు భారత్ ఇబ్బంది పడుతుంటే.. రష్యా మార్కెట్లు స్వాగతం పలుకుతాయని చెప్పారు. భారత్ ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారంలో అండగా ఉండటానికి తమ దేశం కట్టుబడి ఉందని రోమన్ వెల్లడించారు. చిన్న, మాడ్యులర్ అణు రియాక్టర్లపై చర్చలు పురోగతిలో ఉన్నట్లు చెప్పారు. భారత్‌లో ఉత్పత్తులు చేయడానికి న్యూదిల్లీకి సరైన భాగస్వామి రష్యానే అని పేర్కొన్నారు. గతంలో బ్రహ్మోస్ క్షిపణుల తయారీని గుర్తుచేశారు. శక్తిమంతమైన జెట్ ఇంజిన్ల తయారీపైనా పనిచేస్తున్నట్లు చెప్పారు. భారత్ తమకు చాలా ముఖ్యమైన దేశమని.. అందుకే అధ్యక్షుడు పుతిన్ స్వల్ప వ్యవధిలోనే రెండుసార్లు ప్రధాని మోదీతో మాట్లాడారన్నారు. సమస్యల పరిష్కారంపై బీజింగ్-న్యూదిల్లీ కలిసి పని చేయడాన్ని స్వాగతించారు. చైనా మంత్రి వాంగ్‌యీ పర్యటన విజయవంతమైందన్నారు. ఇక రష్యాను శిక్షించేందుకు ఆంక్షలు విధించినవారే ఇప్పుడు ఆ ఫలితాలను అనుభవిస్తున్నారని రోమన్ చెప్పారు. ప్రస్తుతం ప్రపంచ రాజకీయాల్లో కుదుపులు నెలకొన్న నేపథ్యంలో వాటిని స్థిరీకరించే శక్తిగా బ్రిక్స్ ఉంటుందని రోమన్ వెల్లడించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై సుంకాలను రెట్టింపు చేసి 50శాతానికి చేర్చిన నేపథ్యంలో రష్యా నుంచి స్పందన వెలువడటం గమనార్హం. మరికొన్ని రోజుల్లో అవి పూర్తిస్థాయిలో అమల్లోకి రానున్నాయి.

### చమురు కొనుగోళ్ల పునరుద్ధరణ..

రష్యా ఉత్పత్తి చేసే ఉరల్స్ చమురు కొనుగోళ్లను భారత్ రిఫైనరీలు పునరుద్ధరించాయి. ఐవోసీ, బీపీసీఎల్ తాజాగా సెప్టెంబర్, అక్టోబర్ నెలలో డెలివరీలకు ఆర్డర్లు పెట్టాయి. తాజాగా మాస్కో డిస్కౌంట్లను పెంచడంతో ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. న్యూదిల్లీ నుంచి కొనుగోళ్లు పెరగడంతో.. చైనాకు సరఫరాలు తగ్గనున్నాయి. జులైలో డిస్కౌంట్లు తగ్గడంతో.. భారత సంస్థలు కొనుగోళ్లు నిలిపాయి. కానీ ఆ తర్వాత పరిణామాల్లో రాయితీ 3 డాలర్లకు పెరిగింది. తాజాగా ఆర్డర్లు పెట్టినట్లు తెలుస్తోంది.

## గాజాపై ఇజ్రాయెల్ మరో దశ సమరం

### రంగంలోకి 50వేల రిజర్విస్టులు

**ఇజ్రాయెల్ :** గాజా నగరంపై పూర్తిస్థాయిలో పట్టు సాధించే దిశగా అడుగులు వేస్తున్న ఇజ్రాయెల్ సైన్యం మరో దశ సమరానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రణాళికకు అత్యున్నత స్థాయి సైనికాధికారులు ఆమోదం తెలిపినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. ఇందుకోసం రానున్న రోజుల్లో దాదాపు 50వేల మంది రిజర్వు బలగాలను రంగంలోకి దించనున్నట్లు పేర్కొన్నాయి. గాజా నగరంలోని పలు ప్రాంతాల్లో హమాస్ ఇంకా చురుకుగా ఉన్నట్లు ఇజ్రాయెల్ సైన్యం భావిస్తోంది. తమ సైన్యం కార్యకలాపాలు లేని అటువంటి ప్రాంతాలపై దృష్టిపెట్టామని.. త్వరలోనే అక్కడ సైన్యాన్ని మోహరించే ప్రయత్నాలు చేస్తున్నామని ఓ అధికారి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళిక ఆమోదం తుది దశలో ఉందన్నారు. అయితే, ఈ ఆపరేషన్ ఎప్పుడు మొదలవుతుందనే విషయంపై స్పష్టత లేదు. రానున్న నెలల్లో 50వేల మంది రిజర్విస్టులను రంగంలోకి దించనున్నట్లు ఆ అధికారి వెల్లడించారు. దీంతో క్రియాశీల రిజర్విస్టుల సంఖ్య 1.2 లక్షలకు చేరుకుంటుందన్నారు. మరోవైపు గాజాను స్వాధీనం చేసుకోవాలనే ప్రతిపాదనకు సెక్యూరిటీ క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ఇటీవల ప్రకటించింది. ఐడీఎఫ్ దళాలు ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమవుతున్నాయని, యుద్ధభూమికి వెలుపల ఉన్న ప్రజలకు మానవతా సాయం అందించనున్నట్లు పేర్కొంది. ఈ చర్య హమాస్ దగ్గర బందీలుగా ఉన్నవారిని వెనక్కి తీసుకొచ్చే ప్రణాళికలలో భాగమని వివరించింది. అయితే, ప్రధాని నెతన్యాహు మాత్రం గాజాను స్వాధీనం చేసుకోవడం తమ ప్రణాళిక కాదన్నారు. హమాస్‌ను నాశనం చేసి బందీలను వెనక్కి తీసుకున్న తర్వాత, ఆ ప్రాంతాన్ని తాత్కాలిక ప్రభుత్వానికి అప్పగించడమే తమ లక్ష్యమన్నారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

### ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలు



**జనగామ, ఆగస్ట్ 20 :** జనగామ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతిచెందగా.. ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ-సూర్యాపేట హైవేపై వడ్డిచర్ల వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వడ్లపూడికి చెందిన దర్గోజు సురేశ్, దివ్య దంపతులు తమ పిల్లలు లోక్షణ, మోక్షజ్ఞలతో కలసి స్వగ్రామంలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొన్న అనంతరం భార్యపిల్లలతో కలిసి బొలెరో వాహనంలో కరీంనగర్‌కు బయల్దేరారు. మార్గంమధ్యలో లింగాల ఘనపురం మండలం వడ్డిచర్ల నక్షత్ర గార్డెన్ వద్ద వారి వాహనం అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. సురేశ్ అక్కడికక్కడే మృతిచెందగా.. దివ్య 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయారు. పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని జనగామ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కరీంనగర్‌లోని ఓ గ్రానైట్ కంపెనీలో సురేశ్ పనిచేస్తున్నారు.

## టౌన్ ప్లానింగ్ ఎక్కడ..?

- అంతులేని అక్రమ నిర్మాణాలు..
- అత్తా పత్తా లేని అధికారులు..?
- చైన్మెన్‌లు ఉన్నట్టా లేనట్టా..?
- ప్రభుత్వ ఆదాయానికి గండి..!



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :** అభివృద్ధి చెందుతున్న నగరాల్లో రోజు రోజుకి అక్రమ నిర్మాణాలు కూడా జోరందుకుంటున్నాయి. ఆయా నగరాలలో పట్టణ ప్రణాళిక విభాగ నిబంధనలు పాటించని భవనాలపై ఎప్పటికప్పుడు చట్టపరమైన చర్యలు తీసుకుంటూ ఆ భవనాలు ఆకాశానందుతున్న సరే నిట్ట నిలువునా కూల్చేస్తారు అక్కడి అధికారులు. కానీ.. మన నగర విషయానికి వచ్చేసరికి ఆ నిర్మాణం ఎక్కడ ఉన్నా, ఎలా ఉన్నా రోడ్లు చిన్నవైనా, పెద్దవైనా అధికారుల జేబులు నిండితే చాలు బిల్డింగ్ పర్మిషన్ దానంతట అదే వచ్చేస్తుంది. పర్మిషన్ వచ్చేది రెండు మూడు ఫ్లోర్లకి అయినా అక్కడ ఉండే దారి 20 ఫీట్లు అయితే నిర్మించే నిర్మాణం మాత్రం ఐదు, ఆరు అంతస్తులకు తగ్గదు తగ్గనివ్వరు. కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని అడ్డగుట్ట, ఆల్విన్ కాలనీ ప్రాంతాలలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను చూస్తే కొట్టొచ్చినట్లు అర్థం అయిపోతుంది అవి అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలేనని. ఇక్కడ జరుగుతున్న నిర్మాణాలన్నీ అధికారులకు తెలిసి జరుగుతున్నా మరి అధికారులు ఏం చేస్తున్నారంటే చోద్యం చూసుకుంటూ ఫ్లోర్ కి ఇంత అని లెక్క కట్టి మరీ జేబులో నింపుకొని ఆఫీసుల్లో సీట్లకే పరిమితమై ఉండిపోతున్నారు. పలుమార్లు స్థానిక ప్రజలు కొన్ని అక్రమ నిర్మాణాలపై సంబంధిత అధికారులకు కంప్లైంట్లు ఇచ్చినా అవన్నీ బుట్టదాకలై పోతున్నాయి కానీ అధికారులు మాత్రం ఎటువంటి చర్యలకు కూడా నోచుకోవడం లేదు అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు నిర్మాణదారులు రెసిడెన్షియల్ కి పర్మిషన్ తీసుకొని కమర్షియల్ భవనాలు కూడా నిర్మిస్తూ ప్రభుత్వ ఆదాయానికి తీవ్రమైన గండి కొడుతున్నారని సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సదరు నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





## ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

### ఆన్‌లైన్ గేమ్స్, ఈ-స్పోర్ట్స్ మధ్య విభజన చూపించేలా బిల్లు

**న్యూఢిల్లీ :** డబ్బులతో ముడిపడిన ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహణను నిషేధించే కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 'ది ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025' పేరిట తీసుకొచ్చిన ఈ బిల్లును కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మూజువాణి ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు కొంతమంది బానిస కావడం, మనీలాండరింగ్, ఆర్థిక మోసాల వంటివి ఇటీవల కాలంలో పెరిగిపోయిన నేపథ్యంలో కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ గేమ్స్, ఈ-స్పోర్ట్స్ మధ్య విభజన చూపించేలా బిల్లును రూపొందించారు. నిబంధనల్ని ఉల్లంఘించి ఆన్‌లైన్ గేమ్స్ అందిస్తున్న వారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష, లేదా రూ.కోటి వరకు జరిమానా, లేదా ఆ రెండూ విధించాలని ప్రతిపాదించారు. సంబంధిత అడ్వర్టయిజ్‌మెంట్లలో భాగం పంచుకున్నవారికి గరిష్ఠంగా రెండేళ్ల జైలుశిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. వీటి ఆర్థిక లావాదేవీల్లో ప్రమేయం ఉన్నవారికీ గరిష్ఠంగా మూడేళ్ల శిక్ష, రూ.కోటి వరకు జరిమానా వేస్తారు. ఆన్‌లైన్ మనీ గేమ్స్ ఆడేవారిని నేరస్థులుగా కాకుండా.. బాధితులుగా ఈ బిల్లులో పేర్కొన్నారు. మరోవైపు.. ఈ బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాసింది. గేమింగ్‌పై నిషేధం విధించే కంటే.. నియంత్రణ ఉంచాలని సూచించింది.



## స్త్రీశక్తి పథకం సూపర్ సక్సెస్

- పక్క రాష్ట్రాల్లో అధ్యయనం చేశాం
- ఆర్టీసీ అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయం
- ఆర్టీసీ అధికారులతో సమీక్షించిన మంత్రి రామ్ ప్రసాద్

**అమరావతి :** కూటమి ప్రభుత్వం మహిళల కోసం అందించిన స్త్రీ శక్తి సూపర్ సక్సెస్ అయిందని రవాణాశాఖామంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి అన్నారు. స్త్రీ శక్తి పథకం సక్సెస్ సందర్భంగా పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఏపీఎస్ ఆర్టీసీ అధికారులతో మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు- చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటి ఒక్కో విశిష్టత కలిగి ఉన్నాయని, వాటిలో మహిళామూర్తులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే స్త్రీ శక్తి పథకం విజయవంతం కావడం అభినందనీయమన్నారు. ఉచిత బస్సు పథకం అమలుకు ముందు పక్క రాష్ట్రాల్లోపథకం అమలు తీరును అధ్యయనం చేసిన తరువాతనే మన రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన మహిళలకు ఉచిత బస్సు పథకమని ఇందుకు వారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని తెలిపారు. పథకం అమలు తీరులో చిన్న చిన్న లోటుపాట్లు సహజమని, ఒడిదుడుకులను తట్టుకుని సద్విమర్శలను పరిగణలోకి తీసుకుని పథకంను విజయవంతం చేయడంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు. స్త్రీ శక్తి పథకం అమలు ప్రభుత్వానికి భారం కాదని, బాధ్యత అని మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అన్నింటిలో స్త్రీ శక్తి పథకం టాప్ లో ఉంటుందన్నారు. ఈ ఆరు రోజుల్లో 65 లక్షల మందికి పైగా మహిళలు ఫ్రీ బస్సు సేవలను సద్వినియోగం చేసుకున్నారని వివరించారు. ఈ మేరకు ఆర్టీసీకి ప్రభుత్వం సబ్సిడీ చెల్లిస్తుందన్నారు. ఫ్రీ బస్సు పథకం ప్రారంభానికి ముందే బస్ స్టేషన్లు, బస్ షెల్టర్లలలో రద్దీకి అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. దీంతో సమస్యలు ఉత్పన్నమవ్వ లేదని వివరించారు. స్త్రీ శక్తి పథకం విజయానికి ఆర్టీసీ సిబ్బంది టీ-మ్ వర్క్ అద్భుతమన్నారు. మన ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చిత్తశుద్ధితో పథకంను అమలు చేస్తున్నామని, ఇకపై కూడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పథకంను నిర్విఘ్నంగా అమలు చేస్తామన్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించే ఫ్రీ బస్సు లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందించే యోచనలో ఉన్నామని మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ప్రతి బస్సులో సీసీ కెమెరాలు, కండెక్టర్ల కు బాడీ కెమెరాలు ఏర్పాటు- చేయనున్నామని తెలిపారు ఆర్టీసీని బలోపేతం చేస్తాం. పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. ఆర్టీసీ పరిపుష్టికి వనరులు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఆర్టీసీ స్థలాలను లీజుకు ఇచ్చి ఆదాయం సమకూర్చుకుంటామని, కార్గో సేవలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం ప్రయాణీకుల రద్దీకి అవసరమైన కొత్త బస్సులను కొనుగోలు చేయలేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వం త్వరలో 750 ఎలక్ట్రిక్రల్ బస్సులు తీసుకురానుందని, మరో నాలుగేళ్లలో 2500కు పైగా నూతన బస్సులను కొనుగోలు చేయనున్నామని తెలిపారు. నూతనంగా కొనుగోలు చేసే బస్సులన్నీ ఎలక్ట్రిక్రల్ బస్సులే అని వివరించారు. దాంతో రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా పల్లె వెలుగు బస్సులు సైతం ఏసీ బస్సులే ఉంటాయని చెప్పారు. ఘాట్ రోడ్ ప్రాంతాల్లో సైతం ఫ్రీ బస్సు అమలు చేస్తున్నామని, రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, మరో వారం రోజుల్లో ఆ సమస్యలను పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. తిరుమలకు కూడా ఫ్రీ బస్సు అమలుపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామన్నారు. అలాగే సాంకేతిక సమస్యలను పరిష్కరించి అతి త్వరలోనే తిరుమలకు ఫ్రీ బస్సు పై అనుకూల ప్రకటన వస్తుందన్నారు. ఆర్టీసీకి ప్రయాణీకులు, సిబ్బంది రెండు కళ్లు వంటి వారని, వారి సంక్షేమం, రక్షణ బాధ్యతల్లో వెనక్కు తగ్గేది లేదన్నారు. ముఖ్యంగా మహిళల రక్షణ విషయం రాజీపడే ప్రసక్తే లేదన్నారు. అతి త్వరలో కండెక్టర్ పోస్ట్ లు భర్తీ చేస్తామని హామి ఇచ్చారు. ఉచిత బస్సు పథకం ఆర్టీసీ సంస్థలోని దాదాపు 75 శాతం బస్సుల్లో వర్తిస్తుందన్నారు. మహిళలు, బాలికలు, ట్రాన్స్ జెండర్లు ఉచిత బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థిక వెసులుబాటును పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# టీసీఎస్‌లో 30 వేల మందికి లేఆఫ్?..




## యూనియన్ ఆరోపణలపై స్పందించిన సంస్థ

ప్రముఖ టెక్ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో తలపెట్టిన లేఆఫ్‌లను యూనియన్ ఆఫ్ ఐటీ, ఐటీఈఎస్ ఎంప్లాయీస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. లేఆఫ్‌ల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ఈ విషయంలో ప్రభుత్వ జోక్యం చేసుకోవాలని కోరుతోంది. లేఆఫ్‌ల కారణంగా దాదాపు 30 వేల మందిపై ప్రభావం పడుతుందని యూనియన్ ఆరోపించగా.. దీనిపై టీసీఎస్ తాజాగా వివరణ ఇచ్చింది. 12 వేల మంది ఉద్యోగులను తొలగించాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా చెన్నైలో మంగళవారం యునైట్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు ఆందోళన చేపట్టారు. టీసీఎస్‌కు వ్యతిరేకంగా ఈ సందర్భంగా బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. టీసీఎస్ సీనియర్, మేనేజర్ స్థాయి ఉద్యోగులను తొలగిస్తోందని, ఈ ప్రక్రియలో సుమారు 30 వేల నుంచి 40 వేల మందిపై ప్రభావం పడుతుందని యునైట్ సభ్యురాలు జనని ఆవేదన వ్యక్తంచేశారు. అనుభవజ్ఞుల స్థానంలో కొత్తగా చేరిన ఫ్రెషర్లను 80-85 శాతం తక్కువ జీతానికి నియమించుకుంటోందని యునైట్ ఆరోపిస్తోంది. ఉద్యోగులను తొలగించే బదులు వారి నైపుణ్యాలను పెంచాలని డిమాండ్ చేసింది. రూ.2.55 లక్షల కోట్ల ఆదాయం కలిగిన కంపెనీ.. లాభార్జన కోసం ఉద్యోగులను తొలగించడం అన్యాయమని పేర్కొంది. యునైట్ ఆరోపణలపై టీసీఎస్ ఓ పత్రికా ప్రకటనను విడుదల చేసింది. 30 వేల మందిని తొలగిస్తున్నారన్న ఆరోపణలను ఖండించింది. 'ఈ ఊహాగానాలు తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాయి. ముందుగా చెప్పినట్లే మా ఉద్యోగుల సంఖ్యలో 2 శాతం.. అంటే దాదాపు 12 వేల మందికి పైగా మాత్రమే తొలగించనున్నాం' అని టీసీఎస్ పేర్కొంది.






## యాపిల్ ఐఫోన్ 17 మోడళ్లన్నీ భారత్‌లోనే...

ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ యాపిల్ తన ఐఫోన్ల ఉత్పత్తిని భారత్‌లో విస్తృతం చేస్తోంది. త్వరలో విడుదల కాబోయే ఐఫోన్ 17 మోడళ్లన్నింటినీ (ప్రో వెర్షన్లు సహా) దేశంలోనే తయారు చేయాలని నిర్ణయించింది. చైనా మీద ఆధారపడడాన్ని తగ్గించి, అమెరికాకు ఎగుమతులపై టారిఫ్ రిస్కులను తప్పించుకోవడానికి యాపిల్ ఈ వ్యూహాత్మక ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే భారత్ నుంచి అమెరికాకు ఐఫోన్ ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. యాపిల్ రాబోయే అన్ని ఐఫోన్ 17 మోడళ్లను భారత్‌లోని ఐదు ప్లాంట్లలో చేపట్టనుంది. విడుదలకు ముందే ప్రో వెర్షన్లు సహా అన్ని కొత్త ఐఫోన్ మోడళ్లను భారత్‌లోనే తయారుచేయడం ఇదే మొదటిసారి. తమిళనాడులోని హొసూర్‌లో టాటా గ్రూప్ ఆధ్వర్యంలోని ప్లాంట్‌తో పాటు బెంగళూరు విమానాశ్రయం సమీపంలోని ఫాక్స్‌కాన్ యూనిట్ ఈ ఉత్పత్తిలో కీలక భూమిక పోషించనున్నాయని బ్లూమ్‌బెర్గ్ తెలిపింది.

## ఇన్ఫోసిస్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

### ఆగస్టు జీతంతో 80% బోనస్




ప్రముఖ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గానూ పనితీరు ఆధారిత బోనస్‌లను ప్రకటించింది. అర్హులైన ఉద్యోగులకు సగటున 80 శాతం చొప్పున బోనస్ చెల్లించనుంది. ఆగస్టు నెల వేతనంతో ఈ మొత్తం చెల్లింపులు చేయనున్నట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. ఈ మేరకు అంతర్గతంగా సందేశాలు పంపుతోంది. క్యూ1లో మెరుగైన పనితీరు నేపథ్యంలో కంపెనీ ఈ స్థాయిలో బోనస్‌ను ప్రకటించడం గమనార్హం. పనితీరు ఆధారంగా ఈ చెల్లింపులు జరగనున్నాయి. లెవల్ పీఎల్4 ఉద్యోగుల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి అత్యధికంగా 89 శాతం బోనస్ చెల్లిస్తారు. అంచనాలు అందుకున్న ఉద్యోగులకు 80 శాతం చొప్పున చెల్లింపులు చేయనున్నారు. అలాగే, లెవల్ పీఎల్5, లెవల్ పీఎల్ 6 ఉద్యోగులకు 78-87 శాతం, 75-85 శాతం చొప్పున చెల్లిస్తారు. పీఎల్4, పీఎల్5, పీఎల్6 కేటగిరీల్లో 'దృష్టి సారించాల్సిన' ఉద్యోగులకు కూడా 80 శాతం, 75 శాతం, 70 శాతం చొప్పున బోనస్ చెల్లించనున్నట్లు ఇంటర్నల్ మెమోలో ఇన్ఫోసిస్ పేర్కొంది. వ్యక్తిగత బోనస్ లెటర్లను ఉద్యోగుల ఇ- డాకెట్స్‌లో అప్‌లోడ్ చేస్తామని పేర్కొంది. జులై 23న వెలువరించిన త్రైమాసిక ఫలితాల్లో ఇన్ఫోసిస్ అంచనాలను మించి రాణించింది. గతేడాదితో పోలిస్తే కంపెనీ నికర లాభం 8.7 శాతం వృద్ధి చెంది రూ.6921 కోట్లుగా నమోదైంది. ఆదాయం సైతం 7.5 శాతం వృద్ధితో రూ.42,279 కోట్లుగా పేర్కొంది. రెండు మెట్రిక్స్‌లోనూ అంచనాలను మించిన పనితీరును కంపెనీ నమోదు చేసింది.

## రాణించిన ఐటీ స్టాక్స్



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో ఉదయం నష్టాల్లో ట్రేడయిన సూచీలు.. ఐటీ స్టాక్స్ మద్దతుతో లాభాల్లో స్థిరపడ్డాయి. ముఖ్యంగా ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు సూచీలను ముందుకు నడిపించాయి. ఈ క్రమంలోనే నిఫ్టీ మళ్లీ నెల రోజుల తర్వాత 25 వేల మార్కును అందుకుంది. సెన్సెక్స్ ఉదయం 81,671.47 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,644.39) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో కాసేపు నష్టాల్లో ట్రేడయిన సూచీలు.. క్రమంగా పుంజుకొన్నాయి. ఇంట్రాడేలో 81,985.62 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్ చివరికి 213.45 పాయింట్ల లాభంతో 81,857.84 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 69.90 పాయింట్ల లాభంతో 25,050.55 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.06గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టీసీఎస్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ, టాటా స్టీల్ ప్రధానంగా లాభపడ్డాయి. బీఈఎల్, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, ట్రెంట్, ఐటీసీ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 66.16 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3,326.05 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




## సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణను కాదని హర్షిత్ రాణాకు ఎలా అవకాశం ఇచ్చారు?

యూఏఈ వేదికగా ఆసియా కప్.. సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభం కానుంది. ఈ టోర్నీ.. టీ20 ఫార్మాట్లో జరగనుంది. ఆసియాకప్‌లో పాల్గొనబోయే భారత జట్టును బీసీసీఐ సెలెక్టర్లు మంగళవారం ప్రకటించారు. అయితే దీనిపై టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. బౌలింగ్‌లో అద్భుతంగా రాణిస్తున్న మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణను కాదని హర్షిత్ రాణాను ఎలా జట్టులోకి తీసుకుంటారని ప్రశ్నిస్తున్నాడు. 'అసలు టీమ్‌లోకి హర్షిత్ రాణా ఎక్కడ నుంచి వచ్చాడు. అతడి ప్రదర్శన ఐపీఎల్‌లోనూ పేలవంగా ఉది. అతడి ఎకానమీ 10గా ఉంది. అతణ్ని ఎంపిక చేసి.. మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణకు ఏం సందేశం ఇద్దామనుకుంటున్నారు?' అని శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానల్‌లో కుండబద్దలు కొట్టినట్లుగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. అలాగే జట్టు సమతూకం మీద కూడా అతడు తన అసంతృప్తిని వ్యక్తపరిచాడు. ముఖ్యంగా వాషింగ్టన్ సుందర్‌కు జట్టులో స్థానం దక్కకపోవడాన్ని అతడు ప్రశ్నించాడు. 'శివమ్ దూబేను ఎనిమిదో స్థానంలో ఆడించాలనుకోవడం సరైన నిర్ణయం కాదు. అతడు ఐపీఎల్‌లో పెద్దగా బౌలింగ్ చేయలేదు. ఆ ప్లేస్‌లో బౌలింగ్, బ్యాటింగ్ చేసే సామర్థ్యమున్న ఆటగాణ్ని ఎంపిక చేయాలనుకుంటే.. దానికి వాషింగ్టన్ సుందర్ సరిగ్గా సరిపోతాడు' అని శ్రీకాంత్ విశ్లేషించాడు. అయితే హర్షిత్ రాణాను జట్టులోకి తీసుకోవడానికి గల కారణాల గురించి.. టీ20 టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్.. టీమ్ ప్రకటన సందర్భంగా మాట్లాడాడు. 'హర్షిత్ రాణా.. ఐపీఎల్, అంతర్జాతీయ క్రికెట్‌లోనూ అద్భుతంగా రాణిస్తున్నాడు. పుణెలో జరిగిన కంకషన్ రీప్లేస్‌మెంట్ గేమ్ నాకు ఇంకా గుర్తుంది. అలాగే హర్షిత్ రాణా తాను టీమ్‌ఇండియా తరఫున ఆడిన చివరి టీ20 మ్యాచ్‌లో.. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు. అతడి నైపుణ్యం మీద మాకు నమ్మకముంది. అందుకే మేం అతణ్ని ఎంపిక చేశాం' అని సూర్యకుమార్ యాదవ్ పేర్కొన్నాడు.

## ఆటగాళ్లను ఏమనొద్దు.. కేంద్రం ఆదేశాలే పాటిస్తారు

### పాక్‌తో మ్యాచ్‌పై గావస్కర్



ఆసియా కప్ కోసం టీమ్‌ఇండియా తన స్క్వాడ్‌ను ప్రకటించింది. పాకిస్థాన్ కూడా ఇప్పటికే జట్టును వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే, భారత్ - పాక్ మ్యాచ్ జరుగుతుందా? లేదా? అనేది ఇప్పటికీ అభిమానులకు అనుమానంగానే ఉంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌తో క్రికెట్ సంబంధాలనూ తెంచుకోవాలనే డిమాండ్లూ వచ్చాయి. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ లీగ్‌లో పాక్‌తో భారత ఛాంపియన్స్ ఆడలేదు. ఇప్పుడు ఆసియా కప్‌లో ఏ నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. ఇందులో ఏ సంశయం వద్దని.. కేంద్ర ప్రభుత్వం ఏం చెబితే దానిని బీసీసీఐ, టీమ్‌ఇండి యా ఫాలో అవుతుందని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ సూచించాడు. ఇలాంటప్పుడు ప్లేయర్లపై ఎవరూ విమర్శలు చేయొద్దని వ్యాఖ్యానించాడు. "పాకిస్థాన్‌తో మ్యాచ్‌పై భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే.. దానిని అందరూ అనుసరించాలి. ఇందులో ఆటగాళ్లను విమర్శించకూడదు. వెంటనే కొందరు ప్లేయర్లపై కామెంట్లు చేయడానికి సిద్ధమైపోతారు. కానీ, ఇక్కడ ఓ విషయం గుర్తుపెట్టుకోవాలి. ఆటగాళ్లు బీసీసీఐతో సెంట్రల్ కాంట్రాక్ట్ కలిగిఉంటారు. బీసీసీఐ మాత్రం ప్రభుత్వం ఆదేశాలను పాటిస్తుంది. కాబట్టి, ఇదంతా కేంద్రంపై ఆధారపడి ఉంది. ఈ విషయంలో ఆటగాళ్లు నిస్సహాయులు. ఇప్పుడు ఆసియా కప్ కోసం జట్టు ప్రకటన జరిగింది. 'మీరు వెళ్లి ఆడండి' అని కేంద్రం చెబితే ఆడాల్సిందే. అలాకాకుండా 'వద్దు. మీరు ఆడేందుకు అనుమతి ఇవ్వం' అని చెబితే అందుకు తగినట్టుగానే బీసీసీఐ వ్యవహరించాలి. అందుకే, భారత ప్రభుత్వం నిర్ణయం మేరకే బీసీసీఐ ముందుకు వెళ్లాల్సిఉంటుంది" అని గావస్కర్ స్పష్టంచేశాడు.

**గిల్ వైస్ కెప్టెన్సీపై..**

"ఆసియా కప్ కోసం ప్రకటించిన జట్టు చాలా బాగుంది. లోతైన బ్యాటింగ్‌ను చూస్తే కుడి - ఎడమ కాంబినేషన్‌తో వైవిధ్యంగా ఉంది. ఇక సమతూకంతో ఎంపిక చేసిన బౌలింగ్ యూనిట్ కూడా సూపర్. ఇక శుభ్‌మన్ గిల్‌కు వైస్ కెప్టెన్ ఇవ్వడం మంచి నిర్ణయం. ఇటీవలే అతడు 750ం పరుగులు చేశాడు. ఇంత మంచి ఫామ్‌లో ఉన్న క్రికెటర్‌ను వదులుకోలేం. ఇప్పుడు ఉప సారథిగా నియమించడం వెనక పెద్ద ప్రణాళికే ఉంది. భవిష్యత్తులో టీ20 సారథిగా ఎంపిక చేసే అవకాశం లేకపోలేదు" అని గావస్కర్ వ్యాఖ్యానించాడు.

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్..

### రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ స్థానాలు గల్లంతు




ఐసీసీ తాజాగా ఆగస్టు 20న ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల స్థానాలు గల్లంతయ్యాయి! వీరిద్దరూ ఇప్పటికే టీ20, టెస్ట్ క్రికెట్‌కు తమ రిటైర్మెంట్ ప్రకటించారు. అయితే గతవారం (ఆగస్టు 13) ప్రకటించిన ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో 756 పాయింట్లతో రోహిత్ శర్మ రెండో స్థానం, 736 పాయింట్లతో విరాట్ కోహ్లీ నాలుగోస్థానంలో నిలిచారు. శుభ్‌మన్ గిల్ ఇప్పటికీ మొదటి స్థానంలో (784 పాయింట్లు) కొనసాగుతున్నారు. తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో పాకిస్థాన్ బ్యాటర్ బాబర్ అజామ్ 739 పాయింట్లతో రెండోస్థానంలో నిలిచాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి ఈ ర్యాంకింగ్స్‌లో అసలు స్థానం దక్కలేదు. కారణాలేంటో స్పష్టంగా తెలియకపోయినా.. ఏదైనా సాంకేతిక లోపంతో ఇలా జరిగి ఉండవచ్చని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లీ ఇద్దరూ చివరగా తమ వన్డే మ్యాచ్‌ను యూఏఈ వేదికగా జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా ఆడారు. తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో టాప్- 10లో టీమ్‌ఇండియా నుంచి శుభ్‌మన్ గిల్, శ్రేయస్‌అయ్యర్ మాత్రమే స్థానం దక్కించుకున్నారు.

**ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్ (ఆగస్టు 20)**

శుభ్‌మన్ గిల్ - భారత్ - 784 పాయింట్లు
బాబర్ అజామ్ - పాకిస్థాన్ - 739 పాయింట్లు
డారిల్ మిచెల్ - న్యూజిలాండ్ -720 పాయింట్లు
చరిత్ అసలంక- శ్రీలంక- 719 పాయింట్లు
హ్యారీ టెక్టర్ - ఐర్లాండ్- 708 పాయింట్లు
శ్రేయస్ అయ్యర్ - భారత్ - 704 పాయింట్లు
షాయ్ హోప్- వెస్టిండీస్- 699 పాయింట్లు
ఇబ్రహీం జద్రాన్- అఫ్గానిస్థాన్- 676 పాయింట్లు
కుశాల్ మెండిస్- శ్రీలంక- 669 పాయింట్లు
ట్రావిస్ హెడ్- ఆస్ట్రేలియా- 648 పాయింట్లు

## జైస్వాల్‌కు చోటు లేకపోవడం తగదు : అశ్విన్




ఆసియా కప్ కోసం 15 మందితో కూడిన భారత స్క్వాడ్‌ను బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. అనూహ్యంగా యశస్వి జైస్వాల్‌కు అందులో అవకాశం ఇవ్వకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత టీ20 ప్రపంచకప్‌లో బ్యాకప్ ఓపెనర్‌గా ఉన్న యశస్వికి ఇప్పుడు ఆసియా కప్‌లో చోటు కల్పించకపోవడం సరికాదని అశ్విన్ వ్యాఖ్యానించాడు. అతడి స్ట్రైక్‌రేట్ కూడా చాలా బాగుందని గుర్తుచేశాడు. "యశస్వి జైస్వాల్‌కు టెస్టు అవకాశం వచ్చినప్పుడు స్వీకరించాడు. ఈ మధ్యకాలంలో టెస్టుల్లోకి అడుగుపెట్టిన అత్యంత విజయవంతమైన క్రికెటర్ యశస్వి. ఏ ఫార్మాట్‌లో అయినాసరే ఎప్పుడు అవకాశం వచ్చినా వదులుకోలేదు. అయినా సరే అతడికి ఇప్పుడు ఛాన్స్ రాలేదు. ఒక దశలో నాయకత్వం రేసులోనూ నిలిచిన ఆటగాడు ఏకంగా జట్టులోనే లేకపోవడం షాక్‌కు గురిచేసింది. ఈ ఫార్మాట్‌లో యశస్వి స్ట్రైక్‌రేట్ 165. చాలాసార్లు తన కోసం కాకుండా జట్టు కోసం ఆడే వారిని కనుక్కోవడం చాలా కష్టం. అలాంటి పరిస్థితుల్లో యశస్వి జైస్వాల్ ఉంటే సరిగ్గా సరిపోతాడు. ఆ జాబితాలో శ్రేయస్ అయ్యర్ కూడా ఉంటాడు" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు.

**బీసీసీఐ వర్గాల వాదన ఇలా..** ఆసియా కప్ ముగిసిన తర్వాత టెస్టు సిరీస్‌లు ఉన్నాయి. ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల్లో ఆడిన ఓపెనర్ యశస్వికి ఇప్పుడు విశ్రాంతి ఇచ్చి.. సుదీర్ఘ ఫార్మాట్‌లో బరిలోకి దింపాలని బీసీసీఐ భావిస్తోంది. అందుకే, అతడికి అవకాశం ఇవ్వలేదని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఇప్పుడు గిల్‌ను తీసుకొని.. ముమ్ముందు కెప్టెన్సీ అప్పగిస్తారని వార్తలు వస్తున్నాయి.

# అమెరికా భాగస్వామ్యం భారత్‌కు ఎందుకు ముఖ్యం?

## హర్ష్ గోయెంకా



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్ పట్ల అనుసరిస్తున్న వైఖరి ఇరు దేశాల మధ్య బలమైన సంబంధాలను దెబ్బతీసేలా ఉందని ఇరుదేశాల రాజకీయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నామన్న ఆక్రోశంతో ఇటీవల మన దేశంపై మరో 25శాతం అదనపు సుంకాలు విధించడం తీవ్ర చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. అయితే, అమెరికా భారత్ ఎగుమతులపై సుంకాలు విధించవచ్చేమో గానీ, దేశ సార్వభౌమత్వంపై కాదంటూ ఆ సమయంలో ట్వీట్ చేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్‌పీజీ గ్రూపు ఛైర్మన్ హర్ష్ గోయెంకా తాజాగా ఇరు దేశాల సంబంధాలపై స్పందించారు. అమెరికా భాగస్వామ్యం భారత్‌కు ఎందుకు ముఖ్యమో వివరిస్తూ ఆయన 'ఎక్స్'లో షేర్ చేసిన ఏడు అంశాలివే..



- ఇప్పటికీ అమెరికా ఏకైక సూపర్ పవర్. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, బలమైన మిలటరీ వ్యవస్థతో ప్రపంచాన్ని ప్రభావితం చేసే అగ్రరాజ్యం.
- భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి చైనా కాదు.. అమెరికానే.
- అమెరికాతో వ్యాపారం ద్వారా భారత్‌కు 40 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులు ఉండగా.. చైనాతో మాత్రం 100 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఉండటం గమనార్హం.
- అమెరికాతో భారత్‌కు రక్షణ, సాంకేతికత, ఆవిష్కరణలు తదితర రంగాల్లో వ్యూహాత్మక ప్రయోజనాలున్నాయి.
- కార్గిల్ యుద్ధం వంటి సంక్షోభ సమయంలో అమెరికా మనకు మద్దతుగా నిలిచింది. కరవు వంటి సంక్షోభాల సమయంలో ఆహారాన్ని సరఫరా చేసింది.
- చైనా, రష్యా లేదా మరే ఇతర దేశాన్నీ మనం దీర్ఘకాలిక భాగస్వామిగా విశ్వసించలేం.
- అమెరికాతో స్నేహ బంధం పెంపొందించుకోవడం భారత్ పురోగమనానికే కాకుండా భద్రత, ప్రపంచ స్థాయి గుర్తింపునకు దోహదపడుతుంది.
- మరోవైపు, అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి ఆ దేశంలో పర్యటించనున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. సెప్టెంబరులో న్యూయార్క్ వేదికగా జరగనున్న ఐక్యరాజ్య సమితి 80వ సమావేశాలకు మోదీ హాజరు కానున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. సెప్టెంబరు 9న ఈ సమావేశాలు ప్రారంభం కానుండగా.. 23-29 మధ్య ఉన్నతస్థాయి చర్చలు జరగనున్నాయి. 26న భారత 'ప్రభుత్వ అధిపతి' సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారని ఐరాస తాత్కాలిక వక్తల జాబితా పేర్కొంది. అయితే ఈ విషయమై ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ భేటీ అయ్యే అవకాశాలు కనబడుతున్నాయని సదరు వర్గాలు పేర్కొన్నాయి.

అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# ప్రభాస్ 'ఫౌజీ' ఫొటో లీక్.. ప్రొడక్షన్ హౌస్ వార్నింగ్

హను రాఘవపూడి, ప్రభాస్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. 'ఫౌజీ' (వర్కింగ్ టైటిల్)గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా ఈ సినిమా నుంచి ప్రభాస్ లుక్ లీకైంది. అందులో ఈ హీరో వింటేజ్ లుక్‌లో కనిపించడంతో అది క్షణాల్లో వైరలైంది. నెటిజన్లు దాన్ని తెగ షేర్ చేశారు. తాజాగా దీనిపై నిర్మాణ సంస్థ స్పందించింది. కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. "ఈ సినిమా కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారని మాకు తెలుసు. చిత్రీకరణ సమయంలో సెట్స్ నుంచి ఓ ఫొటో బయటకు వచ్చిన విషయం మా దృష్టికి వచ్చింది. మీకు అద్భుతమైన సినిమాటిక్ అనుభవాన్ని ఇచ్చేందుకు మేం నిరంతరం కృషి చేస్తున్నాం. ఇలాంటి లీక్‌లు మా టీమ్ నైతికతను దెబ్బతీస్తాయి. అనధికారికంగా ఎవరైనా ఈ సినిమా ఫొటోలు షేర్ చేస్తే వారి ఖాతాలను తొలగించడమే కాకుండా సైబర్ నేరంగా పరిగణిస్తాం. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని నిర్మాణ సంస్థ తెలిపింది. ఇక 'ఫౌజీ' విషయానికొస్తే.. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. విభిన్నమైన కథ, భారీ బడ్జెట్‌తో సిద్ధమవుతోంది. ప్రభాస్‌కు జంటగా సోషల్‌మీడియా స్టార్ ఇమాన్వీ నటిస్తున్నారు. ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారు. 1940వ దశకంలో జరిగే కథగా.. మాతృభూమి ప్రజలకు న్యాయాన్ని అందించడానికి ఓ యోధుడు చేసే పోరాటంగా మూవీ రానుంది. వాస్తవ సంఘటనలకు కొంత ఫిక్షన్ జోడించి హను రాఘవపూడి ఈ కథను సిద్ధం చేశారు.






## హీరోయిన్స్‌నే అలా అడిగి ఇబ్బందిపెడతారు

### అనుపమ పరమేశ్వరన్

సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్‌ను పట్టించుకోవడం మానేసినట్లు అనుపమ పరమేశ్వరన్ తెలిపారు. ఆమె ప్రధాన పాత్రలో ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన 'పరదా' ఆగస్టు 22న విడుదలకు సిద్ధమైంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను ఆమె పంచుకున్నారు. "సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్‌ను పట్టించుకోను. నేను పరదా పోస్టర్స్ షేర్ చేసినప్పుడు కూడా కొందరు దీనికి నెగెటివ్ కామెంట్స్ పెట్టారు. 'అట్టర్ ఫ్లాప్ అవుతుంది' అన్నారు. ఆ వ్యాఖ్యలు మా సినిమాను నిర్ణయించలేవు. ఒకవేళ నిజంగానే ఇది ప్రేక్షకాదరణ పొందలేకపోయినా.. నేను ఒక మంచి సినిమా (%ౖాతీఖుఎప్త్రు%) తీశాననే సంతృప్తి నాకు జీవితమంతా ఉంటుంది. కెరీర్ ప్రారంభించిన తొలినాళ్లలో ఇలాంటి కామెంట్స్ విని బాధ పడేదాన్ని. అనుభవం వచ్చే కొద్దీ ఇవి చాలా చిన్న విషయాలుగా కనిపిస్తాయి. గతంలో ప్రతి పోస్ట్‌కు వచ్చిన కామెంట్స్ అన్నీ చదివేదాన్ని. ఇప్పుడు నేను చెప్పాలనుకున్న విషయం చెప్పేసి వదిలేస్తున్నా. ఎవరెన్ని మాటలన్నా మనం జీవితంలో ముందుకు వెళ్లాల్సిందే అని అర్థం చేసుకున్నప్పుడు ఇవి చాలా చిన్న విషయాలుగా కనిపిస్తాయి" "టిల్లు స్క్వేర్ తర్వాత నేను మాట్లాడే విధానంలోనూ మార్పు వచ్చింది. ఆ సినిమా విడుదలకు ముందు నాపై చాలా నెగెటివిటీ వచ్చింది. రిలీజ్ అయ్యాక ప్రశంసలు వచ్చాయి. ట్రైలర్ విడుదలయ్యాక నెగెటివిటీ వస్తుందని తెలిసే ఆ పాత్రను ఎంపిక చేసుకున్నాను. అలాంటి రోల్స్‌ను అంగీకరించడమే ఒక సవాలు. వాటిని ఓకే చేయాలంటే ధైర్యం కావాలి. ఆ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూల్లో ఎన్నో ఇబ్బందికరమైన ప్రశ్నలు అడిగారు. అలాంటి ప్రశ్నలు కేవలం మహిళలనే అడుగుతారు. హీరోలను ఎందుకు అడగరు?. వాళ్లకు వ్యూస్ రావడం కోసమే అలా ఇబ్బందికరమైన ప్రశ్నలు అడుగుతారు. వాటికి సమాధానాలు చెప్పలేకపోయాను' అని తెలిపారు.

## ఓటీటీ ట్విస్ట్..

### 'హరి హర వీరమల్లు' క్లైమాక్స్‌లో మార్పు



పవన్ కల్యాణ్ తొలి పాన్ ఇండియా సినిమా 'హరి హర వీరమల్లు' ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. అయితే, ఈ సినిమా థియేటర్ వెర్షన్‌లో కొన్ని మార్పులు చేసి ఓటీటీలోకి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. థియేటర్‌లో ఈ సినిమా విడుదలైనప్పుడు ఇందులోని కొన్ని సన్నివేశాలపై విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. కొన్ని సీన్స్‌లోని వీఎఫ్ఎక్స్ విషయంలో మరింత శ్రద్ధ వహించాల్సిందని కామెంట్స్ వినిపించాయి. ఇప్పుడు ఆ సన్నివేశాలను ఓటీటీ వెర్షన్‌లో తొలగించినట్లు సమాచారం. ముఖ్యంగా గుర్రపు స్వారీ సన్నివేశం, పవన్ కల్యాణ్ బాణం గురిపెట్టే సీన్స్‌ను థియేటర్లో విడుదలైన తర్వాత మార్పులు చేశారు. అయితే ఓటీటీలో ఈ సన్నివేశాలను పూర్తిగా కట్ చేశారని నెటిజన్లు పేర్కొంటున్నారు. క్లైమాక్స్‌లోనూ కొన్ని మార్పులు చేసినట్లు తెలుస్తోంది. అసుర హననం పాట తర్వాత పార్ట్2 ప్రకటనతో సినిమాను పూర్తి చేశారట. క్లైమాక్స్‌లో వచ్చే బాబీదేవోల్ సంభాషణలు, కొన్ని యాక్షన్ సన్నివేశాలను కూడా తొలగించారట. మొత్తం మీద చిత్రబృందం దాదాపు 15 నిమిషాల ఫుటేజ్‌ను కట్ చేసి ఓటీటీలో విడుదల చేసినట్లు తెలుస్తోంది. జులై 24న పాన్ ఇండియా స్థాయిలో విడుదలైన ఈ మూవీ వన్‌మ్యాన్ షోగా పవన్ అభిమానులను ఆకట్టుకుంది. నాలుగు వారాల తర్వాత సడెన్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ మూవీని రెండు భాగాలుగా తెరకెక్కించారు. ఇప్పటికే రెండో పార్ట్‌కు సంబంధించిన కొంత భాగం షూటింగ్ కూడా పూర్తయింది.

## బాహుబలి రీరిలీజ్ కోసం ఎదురుచూపు




భారతీయ సినీ చరిత్రలో సెన్సేషన్ సృష్టించిన సినిమా 'బాహుబలి'. ఇప్పటికీ ఆ మ్యాజిక్, ఆ ఎమోషన్ ఎక్కడ తగ్గలేదు. ఇప్పుడు అదే బాహుబలి సరికొత్త రూపంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రెండు భాగాలను కలిపి, కొత్త సన్నివేశాలు జోడించి రూపొందించిన ఈ స్పెషల్ వెర్షన్‌కు పేరు – 'బాహుబలి ది ఎపిక్'. అక్టోబర్ 31న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానున్న ఈ సినిమాపై, అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రభాస్, రానాలతో ఇప్పటికే ఒక స్పెషల్ ఇంటర్వ్యూ కూడా షూట్ చేసినట్లు– టాక్ ఉంది. అనుష్క కూడా పాల్గొనబోతుందన్న వార్తలు వినిపిస్తున్న, ఆ విషయాన్ని టీమ్ కన్ఫర్మ్ చేయలేదు. కానీ ప్రస్తుతం అనుష్క హైదరాబాద్‌లో ఉన్నందున సెప్టెంబర్‌లో జరిగే ఈవెంట్స్ లో ఆమె పాల్గొనడం ఖాయమనే అంచనాలు ఉన్నాయి. వీరితో పాటుగా రమ్యకృష్ణ, తమన్నా, సత్యరాజ్, సుదీప్, నాజర్ తదితర తారలతో కూడా వరుస స్పెషల్ ఈవెంట్లు–, ఇంటర్వ్యూలు చేస్తున్నట్లు– సమాచారం. ఈ మొత్తం షెడ్యూల్‌ను కార్తికేయ పర్యవేక్షణలో సిద్ధం చేసారని తెలుస్తోంది. ఇక ఈ బాహుబలి ఎపిక్ రిలీజ్ కోసం అభిమానుల్లో క్రేజ్ రోజురోజుకీ పెరుగు తోంది. సహజంగానే దీనికి భారీ ఓపెనింగ్స్ ఖాయమని టాక్ వినిపిస్తోంది. జక్కన్న రాజమౌళి ప్రస్తుతం మహేష్ బాబు సినిమా షూట్‌తో బిజీగా ఉన్నప్పటికీ, అక్టోబర్ రెండో వారం నుంచి పూర్తిగా బాహుబలి ప్రమోషన్లపై దృష్టి సారించనున్నాడు. ఇక నిర్మాత శోభు యార్లగడ్డ వరల్డ్ వైడ్ రిలీజ్ కోసం చేస్తున్నారట. ప్రీమియర్లతో మొదలయ్యే ఈ వేడుకలు అంతర్జాతీయ స్థాయిలో జరుగనున్నాయి. ఒకవేళ ఈ 'సింగిల్ పార్ట్ ఎపిక్ ఫార్ములా' సక్సెస్ అయితే, భవిష్యత్తులో పుష్ప, కెజిఎఫ్ వంటి బ్లాక్‌బస్టర్లు కూడా ఇదే రూట్ ఫాలో అయ్యే ఛాన్స్ ఉంది.

## మోక్షజ్ఞ 'లవ్ స్టోరీ' కోసం ఎదురుచూస్తున్నాడు

### : నారా రోహిత్



ప్రస్తుతం నందమూరి అభిమానులతో పాటు సినీ ప్రియులంతా మోక్షజ్ఞ ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా మోక్షజ్ఞ లుక్ కూడా ఒకటి సోషల్ మీడియాలో వైరలైన విషయం తెలిసిందే. దీనిపై నటుడు నారా రోహిత్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇండస్ట్రీకి వచ్చేందుకు ఈ నందమూరి వారసుడు చాలా ఆసక్తిగా ఉన్నాడని తెలిపారు. "ఇటీవల మోక్షజ్ఞతో మాట్లాడినప్పుడు కూడా స్క్రిప్ట్ కోసం చూస్తున్నట్లు చెప్పాడు. ఈ ఏడాది చివర్లో, లేదంటే వచ్చే సంవత్సరం ప్రారంభంలో అతని ఎంట్రీ ఉండే అవకాశం ఉంది. ఇండస్ట్రీకి రావడం కోసం అతడు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడు. సినిమాల కోసమే లుక్ మార్చుకున్నాడు. గతంలో లుక్ కంటే ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ కోసం వెతుకుతున్నట్లు ఈ మధ్య కలిసినప్పుడు చెప్పాడు. అలాంటి కథ ఉంటే ఈ ఏడాదిలోనే ఎంట్రీ ఉండే అవకాశం ఉంది" అని నారా రోహిత్ తెలిపారు. బాలకృష్ణతో తన మల్టీ స్టారర్‌పై నారా రోహిత్ స్పందించారు. గతంలో స్క్రిప్ట్ రెడీ చేసినట్లు చెప్పారు. "కథ రెడీ చేశారు. మా ఇద్దరికీ లుక్ టెస్ట్ కూడా చేశారు. కథ నచ్చింది. కానీ, ఆ సమయంలో ఆయనకు వరుస సినిమాలు, ఎలక్షన్స్ ఉండడంతో అది పట్టాలెక్కలేదు. బాలయ్య నటించిన మరో సినిమాలోనూ నేను అతిథి పాత్రలో చేయాల్సిఉంది. కానీ, అది కూడా కొన్ని కారణాల వల్ల కుదర్లేదు. ఆ సినిమా స్థానంలోనే ఆయన 'లెజెండ్' చేశారు. భవిష్యత్తులో బాలయ్యతో కలిసి నటించే అవకాశం వస్తే కచ్చితంగా చేస్తాను. ఆ రోజు కోసమే ఎదురుచూస్తున్నా" అని నారా రోహిత్ చెప్పారు. తన రాజకీయ రంగ ప్రవేశం గురించి మాట్లాడుతూ.. తాను సమయం వచ్చినప్పుడల్లా కార్యకర్తలను కలుస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు మంచి చేయడం కోసం తానెప్పుడూ సిద్ధమేనన్నారు. ప్రస్తుతం నారా రోహిత్ నటించిన 'సుందరకాండ' విడుదలకు సిద్ధంగా ఉంది. ఆయన కథానాయకుడిగా కొత్త దర్శకుడు వెంకటేశ్ నిమ్మలపూడి తెరకెక్కించిన చిత్రమిది. శ్రీదేవి విజయ్‌కుమార్, వృతి వాఘని కథానాయికలు. ఈనెల 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. హీరో పెళ్లి కష్టాలు ప్రధానంగా తీర్చిదిద్దిన ఆ వీడియో నవ్వులు పూయించింది. హీరో పరిస్థితిని వివరించేలా సాగిన ర్యాప్ సాంగ్ కూడా అలరించింది.




## 'కన్యాకుమారి' ట్రైలర్ చూశారా

శ్రీచరణ్ రాచకొండ, గీత్ షైని జంటగా నటించిన చిత్రం 'కన్యాకుమారి'. సృజన్ అట్టాడ దర్శకత్వం వహించారు. ఈ నెల 27న సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా ట్రైలర్‌ను బుధవారం విడుదల చేశారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ప్రేమకథతో ఈ చిత్రం రూపొందింది. రైతు పాత్రలో శ్రీచరణ్, ఐటీ ఉద్యోగిగా స్థిరపడాలనే లక్ష్యమున్న కన్యాకుమారిగా గీత్ అలరించేలా ఉన్నారు.



## కావ్య థాపర్ పుట్టిన రోజు.. 'నేను రెడీ' పోస్టర్ రిలీజ్

గతేడాది 'ఈగ, ఊరు పేరు భైరవకోన, డబుల్ ఇస్మార్ట్, విశ్వం' వంటి చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన హీరోయిన్ కావ్య థాపర్ అనుకున్న రేంజ్‌లో హిట్ అందుకోలేకపోయింది. ప్రస్తుతం ఈ బ్యూటీ 'నేను రెడీ' అనే సినిమా చేస్తుంది. త్రినాధరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హవీష్ హీరోగా నటిస్తున్నారు. కుటుంబ కథా చిత్రంగా ఫుల్ ఎంటర్‌టైన్మెంట్‌తో రాబోతున్న ఈ మూవీలో వెన్నెల కిషోర్, అజయ్, హరి తేజ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను హార్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పి బ్యానర్‌పై నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. 'నేను రెడీ' సినిమా అనౌన్స్‌మెంట్ తర్వాత టైటిల్ గ్లింప్స్ తప్ప మరో అప్డేట్ ఇవ్వలేదు మేకర్స్. ఈ క్రమంలోనే నేడు కావ్య థాపర్ పుట్టిన రోజు కావడంతో ఈ సందర్భంగా మూవీ నుంచి అమ్మడు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ప్రజెంట్ ఈ పోస్టర్ ఆడియన్స్‌ను ఆకట్టుకుంటోంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com